

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

బుధవారం 1 అక్టోబరు 2025 | 3

దుర్గాదేవికి హారతి

ఘనంగా దుర్గాష్టమి

కిక్కిరిసిన దేవీచౌక్

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం దేవీచౌక్‌లో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం దుర్గాష్టమి సందర్భంగా వేలాదిమంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి కుంకుమ పూజలు, ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. దుర్గాష్టమి కావడంతో కనక దుర్గ అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. భారీ సెట్టింగ్‌లు, మిరుమిట్లు గొలిపే విద్యుత్ దీపాలను తిలకించేందుకు నగరంతోపాటు ఇతర ప్రాంతాల జనం భారీగా తరలివచ్చారు.





విద్యుత్ వెలుగుల్లో రాజమహేంద్రి దేవీచౌక్ (డ్రోన్ చిత్రం).. మంగళవారం రాత్రి భక్తుల సందడి



వర్షాభావం

లోటు.. కలవరం!

- ముగిసిన నైరుతి రుతుపవనాల సీజన్.. సీజనంతా లోటు వర్షపాతమే
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అధిక వర్షపాతానికి బదులు అంతా కొరతే
- కాకినాడ జిల్లాలో 21 మండలాలకుగాను 16మండలాల్లో లోటు వర్షపాతం
- కోనసీమలోని 22 మండలాలూ లోటుతో రెడ్‌మార్క్‌లో చేరిన వైనం
- తూర్పుగోదావరిలో 19 మండలాలకు తాళ్లపూడి మినహా అన్నీ కొరతే
- అల్లూరి జిల్లా పరిధిలోని ఏజెన్సీ మండలాల్లోనూ కొంత ఇదే పరిస్థితి

(కాకినాడ- ఆంధ్రజ్యోతి)

ఈ ఏడాది వర్షాకాలం సీజన్ నిరాశే మిగిల్చింది. నైరుతి పవనాలు ఊరించి ఊరించి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాను ఉసూరుమనిపించాయి. మంగళవారంతో ముగిసిన నాలుగు నెలల రుతుపవనాల సీజన్ ఉమ్మడి జిల్లాను లోటు వర్షపాతంలోకి నెట్టింది. కావలసిన సాధారణ వర్షపాతం కంటే తక్కువ వర్షపాతంలో రెడ్‌మార్క్‌లోకి చేరింది. కాకినాడ, తూ.గో. కోనసీమ జిల్లాల్లో కలిపి 62 మండలాలకుగాను 57 మండలాలు, అటు అల్లూరి ఏజెన్సీ ప్రాంతంలోని 11 మండలాలకుగాను 5 మండలాల్లో అత్యధిక వర్షపాతం, మిగిలిన 6 మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది. గతేడాది రుతుపవనాల సీజన్‌లో ఉమ్మడి జిల్లాలో భారీ వర్షాలతో అదనపు వర్షపాతం జాబితాలో చేరగా, ఈ సీజన్‌లో మాత్రం లోటులో చేరింది.

ఊరించి.. ఉసూరుమనిపించి...

ఏటా రుతుపవనాల సీజన్ జూన్ నుంచి సెప్టెంబరు వరకు కొనసాగుతుంది. నాలుగు నెలల వ్యవధిలో కురిసే భారీ వర్షాలే వ్యవసాయ రంగానికి, భూగర్భజలాలకు కీలకం. అయితే ఈసారి నైరుతి రుతుపవనాలు ఉమ్మడిజిల్లాను ఈసురోమనిపించింది. ఏటా ఈ సీజన్‌లో భారీ వర్షాలు కురుస్తాయన్న అంచనాలను తల్లకిందులు చేసింది. తొలి రెండు నెలలైన జూన్, జూలైలో వాన జాడే కనిపించకపోవడంతో అంతా ఆగస్టు, సెప్టెంబరులో కురిసే భారీ వర్షాలతో అయినా లోటు తీరుతుందని భావించారు. తీరా మంగళవారంతో ముగిసిన నాలుగు నెలల సీజన్ పరిశీలిస్తే పూర్తిగా లోటు వర్షపాతమే మిగిలింది. కురవాల్సిన సాధారణ వర్షపాతం కాదు కదా అంతకంటే తక్కువగా నమోదైంది. దీంతో ఈఏడాది వర్షాకాలం సీజన్ తక్కువ వర్షాలతో ముగిసినట్టయింది. వాస్తవానికి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో నాలుగు నెలలకు కలిపి సాధారణ వర్షపాతం 2,235మి.మి. నమోదవాల్సి ఉంటే కేవలం 1673మి.మి. నమోదైంది. కాకినాడ జిల్లాలో నాలుగు నెలల సీజన్‌కు కలిపి 670.1మి.మి. వర్షపాతం కురవాల్సి ఉంటే కేవలం 533.8.మి.మి. నమోదైంది. దీంతో జిల్లా లోటు వర్షపాతం జాబితాలో రెడ్ మార్క్‌లో చేరింది. ఈ జిల్లాలో నాలుగు నెలలకు కలిపి సరాసరి వర్షం కురిసిన రోజులు కేవలం 36 మాత్రమే. దీంతో సెప్టెంబరు 30నాటికి నాలుగు నెలల వ్యవధిలో కావలసిన వర్షపాతం కంటే మైనస్ 20.34% లోటు కనిపిస్తోంది. కోనసీమ జిల్లాలో ఈ సీజన్‌లో 779 మి.మి. వర్షపాతానికిగాను కేవలం 539.2మి.మి. నమోదైంది. 30.78% లోటు తేలి డెఫిసిటీ కేటగిరీలో జిల్లా చేరింది. నాలుగు నెలలకు కలిపి ఈ జిల్లాలో వర్షం కురిసిన సరాసరి రోజులు కేవలం 35. తూ.గో.జిల్లాలో ఈ సీజన్‌లో 775.9మి.మి. వర్షపాతం నమోదవాల్సి ఉంటే కేవలం 600.1 నమోదైంది. 22.66% లోటు వర్షపాతంలో జిల్లా రెడ్‌మార్క్‌లో చేరింది. ఈ జిల్లాలో సీజన్‌లో వర్షం కురిసిన రోజులు 43గా నమోదైంది. వాస్తవానికి గత నెల వరకు కాకినాడ జిల్లా ఒక్కటే సాధారణ వర్షపాతంతో గ్రీన్ జాబితాలో ఉండగా, సెప్టెంబరులోను తగినంత వాన లేకపోవడంతో రెడ్‌లోకి చేరింది. ఒకరకంగా చెప్పాలంటే జూన్, జూలైలో వర్షపాతం తక్కువ నమోదైందనుకుంటే అంతకుమించిన లోటు సెప్టెంబరులో తేలింది. కాకినాడ జిల్లాలో జూలైలో సరాసరి వర్షపాతం 202.84 మి.మి. నమోదవాల్సి ఉంటే కేవలం 113.58 మి.మి. నమోదైంది. ఆగస్టులో 183.1 మి.మి.కు 127.31 నమోదైంది. సెప్టెంబరులో అయితే అత్యంత తీసికట్టుగా మారింది. ఈ నెలలో జిల్లాలో 181.33మి.మి. వాన కురవాల్సి ఉంటే కేవలం 59.62 మి.మి. కురిసింది. కోనసీమ జిల్లాలో జూలైలో 242.69మి.మి.కు 97.24మి.మి., ఆగస్టులో 232.1మి.మి.కు 122.25మి.మి., సెప్టెంబరులో 201.81కు 79.03మి.మి. మాత్రమే వర్షం కురిసింది. తూ.గో.లో జూలైలో 246.94మి.మి.కు 117.72, ఆగస్టులో 237.02 మి.మి.కు 82.15, సెప్టెంబరులో 170.95కు కేవలం 64.02మి.మి. నమోదైంది.

ఆ జిల్లాలో అన్నీ రెడ్...

కాకినాడ జిల్లాలో 21 మండలాలకు కేవలం అయిదు మండలాల్లోనే నాలుగు నెలల సరాసరిలో సాధారణ వర్షపాతంతో గ్రీన్ జాబితాలో ఉన్నాయి. మిగిలిన 16 మండలాలు లోటు వర్షపాతంతో రెడ్ కేటగిరీలో ఉన్నాయి. గొల్లప్రోలు 5.56 శాతం, కోటనందూరు 19.98% రౌతులపూడి 16.18%, తొండంగి 1.27%,ఏలేశ్వరం 2.67% అదనపు వర్షపాతం నమోదైంది. మిగిలిన మండలాల్లో లోటు వర్షపాతమే మిగిలింది. తూ.గో. జిల్లాలో మొత్తం 19 మండలాలుండగా ఒక్క తాళ్లపూడి మండలం మినహా మిగిలిన అన్నీ లోటు వర్షపాతంతో రెడ్ కేటగిరీలో చేరాయి. ఇక్కడ నాలుగు నెలల సీజన్‌లో 732.1మి.మి. వర్షం కురవాల్సి ఉంటే 778.1మి.మి. వాన పడింది. కోనసీమ జిల్లాలో 22 మండలాలుండగా, అన్నీ లోటు వర్షపాతంతో అల్లాడుతున్నాయి. ఏ ఒక్క మండలంలో కనీసం అదనం వర్షపాతం మాటే లేదు. అత్యధికంగా రాయవరం మండలంలో మైనస్ 54 శాతం లోటు వర్షపాతం రికార్డు అయింది. ఇక రంపచోడవరం ఏజెన్సీలోని 11 మండలాలకుగాను అడ్డతీగల, గంగవరం, మారేడుమిల్లి, వై రామవరం, ఎటపాకలలో అధిక వర్షపాతం నమోదుకాగా, రంపచోడవరం, రాజవొమ్మంగి, వీఆర్ పురం, చింతూరు, కూనవరం, దేవీపట్నంలలో లోటు నమోదైంది.



చివరిరోజు.. చినుకు

వర్షాకాలం సీజన్ ముగింపు రోజు మంగళవారం ఉమ్మడి జిల్లాలోని పలుచోట్ల వాన చినుకులు పడ్డాయి. కాకినాడ జిల్లాలోని పలుచోట్ల భారీ వర్షం కురవగా, కోనసీమలోని అమలాపురం, పరిసర ప్రాంతాల్లోనూ పెద్ద వర్షమే కురిసింది. తూర్పుగోదావరి జిల్లాలో మాత్రం అక్కడక్కడ చిన్నపాటి వాన పడింది..

గోదా'వరీ'



ధవళేశ్వరం బ్యారేజీ వద్ద వరద ప్రవాహం..



రాజమహేంద్రవరంలో ఘాట్‌లోకి వరద ఉధృతి

వరద ఉధృతి

- ధవళేశ్వరం బ్యారేజీ వద్ద రెండో ప్రమాద హెచ్చరిక దిశగా - లంకల్లోకి వరద

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

గోదావరి ఉధృతంగా మారింది. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద మళ్లీ మొదటి ప్రమాద హెచ్చరిక జారీచేశారు. రెండో ప్రమాద హెచ్చరిక కూడా జారీ చేసే దిశగా ప్రవాహం సాగుతోంది. మంగళవారం రాత్రి 9 గంటలకు బ్యారేజీ నుంచి అంబేద్కర్ కోనసీమ జిల్లా మీదుగా సముద్రంలోకి 11లక్షల 13వేల 227 క్యూసెక్కుల వరద ప్రవాహం పోతోంది. బ్యారేజీ నీటి మట్టం 12.70 అడుగులకు చేరింది. కిందికి వెళ్లే నీటి ప్రవాహం 13 లక్షల క్యూసెక్కులకు చేరినా, బ్యారేజీ నీటిమట్టం 13.75 అడుగులకు చేరినా రెండో ప్రమాద హెచ్చరిక జారీచేస్తారు. ఇక భద్రాచలం వద్ద సాయంత్రం 5గంటలకు నీటిమట్టం 50 అడుగులకు చేరింది. ఇంకా నెమ్మదిగా పెరుగుతోంది. ఇక్కడ 48 అడుగులకు చేరినపుడు రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. నీటి మట్టం 53 అడుగులకు చేరితే మూడో ప్రమాద హెచ్చరిక జారీ అవుతుంది. ప్రస్తుతం భద్రాచలం నుంచి రాజమహేంద్రవరం అఖండగోదావరిలోకి 12లక్షల 51,999 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోస్ ఉంది. ప్రస్తుతం పోలవరం ఎగువ పాపికొండల ప్రాంతం, పోలవరం దిగువన రాజమండ్రి అఖండ గోదావరి ఉగ్రరూపం దాల్చింది. కాగా రోడ్ కం రైలు బ్రిడ్జి నుంచి సాయంకాలం ఒక మహిళా బస్సులో వచ్చి, గోదావరిలో దూకేసినట్టు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. మూడు రోజుల కిందట పుష్కరఘాట్‌లో ఇద్దరు భవానీ భక్తులు స్నానానికి దిగి కొట్టుకుపోయారు. ఈనేపథ్యంలో గోదావరి ఘాట్లలోకి, గోదావరి స్నానానికి ఎవరినీ అధికారులు అనుమతించడంలేదు. కాగా వరద నీటి ఉధృతికి బ్యారేజీ దిగువన ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని లంక భూముల్లోకి వరద ముంచెత్తింది. లంక గ్రామాల్లోకి రాకపోకలూ బంద్ అయ్యాయి. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు.



నేటి నుంచి రాజమండ్రి టు తిరుపతికి విమానం

- ఇప్పటికే ప్రతీరోజు 11 విమానాల రాకపోకలు
- ఢిల్లీ, ముంబాయి, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్‌కు సర్వీసులు
- 1500 మంది ప్రయాణం

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కోరుకొండ మండలం మధురపూడి గ్రామంలో ఉన్న రాజమండ్రి విమానాశ్రయానికి మహర్దశ పట్టింది. బుధవారం నుంచి రాజమండ్రి నుంచి తిరుపతికి విమాన సర్వీసులు ప్రారంభం అవుతున్నాయి. కేంద్ర పౌర విమానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పలువురు ప్రజాప్రతినిధులు, అధికార్ల సమక్షంలో బుధవారం ఈ సర్వీసును ప్రారంభించనున్నారు. వైమానిక సంస్థ అలయెన్స్ ఎయిర్ ఈ సర్వీసును నిర్వహిస్తోంది. ఇప్పటికే ఈ విమానాశ్రయం నుంచి 11 ఇండిగో విమానాలు న్యూఢిల్లీ, ముంబై, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్‌కు రాకపోకలు సాగిస్తున్న సంగతి తెలిసిందే. ఇటీవల విమాన ప్రయాణికుల సంఖ్య కూడా బాగా పెరిగింది. రోజుకు సుమారు 750 మంది ఇతర ప్రాంతాలకు వెళుతున్నారు మరో 750 మంది రాజమండ్రికి వస్తున్నారు. మొత్తం 1500 మంది రాకపోకలు సాగిస్తున్నారు. ఉదయం వెళ్లి సాయంత్రానికి ఇంటికి చేరుకునే అవకాశం దీంతో మరింత చేరువైంది. ఎప్పటినుంచో శ్రీవేంకటేశ్వరస్వామి కొలువైన తిరుపతికి భక్తులతోపాటు అనేక మంది విమాన సర్వీసును కోరుతున్నారు. అది ఇప్పటికి నెరవేరింది. ఇటీవల విమానాశ్రయాన్ని మరింత విస్తరిస్తున్న సంగతి తెలిసిందే. కార్గో సేవలు కూడా బాగా విస్తృతం కానున్నాయి.



యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

14 నెలల్లో 10,293 వీధికుక్కలకు ఆపరేషన్లు

ఏబీసీ సెంటర్ తనిఖీలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వచ్చాక రాజమహేంద్రవరంలో 14 నెలల్లో 10,293 వీధికుక్కలకు యానిమల్ బర్త్ కంట్రోల్ చేయించినట్టు ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు తెలిపారు. మంగళవారం ఆకస్మాత్తుగా రాజమహేంద్రవరం క్వారీసెంటర్ సమీపంలో ఉన్న ఏబీసీ సెంటర్‌ను ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు తనిఖీ చేశారు. అక్కడ ఉన్న సదుపాయాలు, ఆపరేషన్ థియేటర్, షెడ్స్, ఇతర సౌకర్యాలను పరిశీలించారు. పశు వైద్యులతో మాట్లాడి పరిస్థితిని ఆరా తీశారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఆదిరెడ్డి వాసు మాట్లాడారు. ఈ ఏబీసీ సెంటర్‌లో గత వైసీపీ పాలనలో ఐదేళ్లలో 12,100 వీధి కుక్కలకు ఆపరేషన్లు చేయగా, కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఏబీసీ సెంటర్‌లో సౌకర్యాలు మెరుగుపరిచామన్నారు. సిబ్బందిని పెంచామన్నారు. నగరంలో మొత్తం 50 వార్డులు కలిపి 29 వేల 91 కుక్కలు ఉన్నాయని గుర్తించి వేగంగా ఆపరేషన్లు చేయించామన్నారు. గతంలో సగటున నెలకు 300 ఆపరేషన్లు అయితే ఇప్పుడు నెలకు 850 చేస్తున్నారని చెప్పారు. నగరంలో ఇంకా 18,860 వీధి కుక్కలకు ఆపరేషన్ చేయాల్సివుందన్నారు. గతంలో నిర్లక్ష్యం వహించిన వైసీపీ వాళ్లు అవిగో కుక్కలు, ఇవిగో పిల్లులు అంటు చెబుతున్నారే తప్ప గతంలో మన నిర్లక్ష్యం వల్లనే కదా ఇదంతా అని అనుకోవడంలేదన్నారు. స్నేహ యానిమల్ వెల్ఫేర్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ సహకారంతో మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో యాంటీరేబిస్ వ్యాక్సినేషన్ వేస్తున్నారని వాసు తెలిపారు. నగర ప్రజలకు సంబంధించి ఎంత బాధ్యత ఉంటుందో, మూగజీవాల పట్ల తనకు అంతే బాధ్యత ఉందన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్, టీడీపీ నగర అధ్యక్షుడు మజ్జి రాంబాబు, టీడీపీ లీగల్ సెల్ నాయకుడు రాచపల్లి ప్రసాద్ పాల్గొన్నారు.



రూ.157 కోట్లు!

- వైసీపీ హయాంలో ఇసుక అక్రమాలు నిర్ధారించిన మైన్స్ అధికారులు
- ప్రభుత్వానికి నివేదిక.. జేపీ, ప్రతిమ కంపెనీలకు నోటీసులు
- 12చోట్ల జేపీ, 2 చోట్ల ప్రతిమ కంపెనీ అక్రమ తవ్వకాల ధ్రువీకరణ

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

వైసీపీ ప్రభుత్వ హయాంలో 2022 జనవరి నుంచి 2024 జూన్ వరకూ జిల్లాలో అక్రమ ఇసుక తవ్వకాల గుట్టు తేలింది. ఏకంగా రూ.157 కోట్ల 2లక్షల 72వేల 500 విలువైన అక్రమాలు జరిగినట్టు అధికారులు విచారణలో ధ్రువీకరణ అయింది. జిల్లాలో 14 ర్యాంపుల్లో 190.64 హెక్టార్లలో 30లక్షల11వేల 100టన్నుల మేర అక్రమ ఇసుక తవ్వకాలు జరిగినట్టు స్పష్టమైంది. వీటికి స్పందించిన నివేదికను జిల్లా అధికార యంత్రాంగం ప్రభుత్వానికి నివేదించింది. అక్రమ ఇసుక తవ్వకాలు జరిపిన కంపెనీ లకు నోటీసులు జారీచేసింది. అప్పట్లో జేపీ సంస్థకు కాంట్రాక్టు ఇచ్చినా, అనుమతిలేని ప్రాంతాల్లో పరిమితికి మించి ఇసుక తవ్వడం, 2024లో ప్రతిమ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ పేరిట మరి కొన్ని చోట్ల అక్రమాలు జరిగినట్టు తేలింది. నాటి వైసీపీ ప్రభుత్వం ఏవిధమైన నిబంధనలు లేకుండా నగదు రూపంలో డబ్బులు వసూలు చేయడంతోపాటు అనధికారకంగా డ్రెడ్జర్లతోనూ, యంత్రాల సహాయంతోనూ ఇసుక అక్రమాలకు పాల్పడింది. అప్పట్లో ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయని, యంత్రాలను కూడా ఉపయోగిస్తున్నారని, డ్రెడ్జింగ్ చేస్తున్నారని, వివిధ సంస్థల పేరిట వైసీపీ నేతలు దోపిడీ చేస్తున్నారని ఆరోపణలు వచ్చినా, కొందరు కోర్టుకు వెళ్లినా ఎవరూ పట్టించుకోని పరిస్థితి. తర్వాత సుప్రీంకోర్టు స్పందించడంతోపాటు, తెలుగుదేశం కూటమి ప్రభుత్వం కూడా ఈ అక్రమాలు వెలికి తీయించడంతో అక్రమాలు బయటపడ్డాయి.

- **అక్రమాలు లెక్కలేనన్ని..**

జిల్లాలోని 14 రీచ్‌ల్లో అక్రమ ఇసుక తవ్వకాలు జరిగాయి. ఇందులో 12 గ్రామాల పరిధిలోని 12 రీచ్‌ల్లో మిస్టర్స్ జై ప్రకాష్ పవర్ వెంచర్స్ లిమిటెడ్ పేరిట అక్రమ తవ్వకాలు జరిగాయి. కొవ్వూరు మండలంలోని కుమారదేవం రీచ్‌లో 2020 జనవరి 17నుంచి 8.81 హెక్టార్లలో పరిమితికి మించి 88,100 క్యూబిక్ మీటర్లు ఇసుక తవ్వకాలు జరిగాయి. తాళ్లపూడి మండలంలోని బల్లిపాడు గ్రామ పరిధిలో 2022 జనవరి 29 నుంచి 6.03 హెక్టార్లలో 60,300 క్యూబిక్ మీటర్లు, వేగేశ్వరపురం గ్రామ పరిధిలో 2022 జనవరి 17నుంచి 15.28 హెక్టార్లలో 1లక్షా, 58వేల 800 క్యూబిక్ మీటర్లు ఇసుక అక్రమ తవ్వకాలు జరిగాయి. నిడదవోలు మండలంలోని పెండ్యాల గ్రామంలో అదే ఏడాది మే 30వ తేదీ నుంచి 31.34 హెక్టార్లలో 3 లక్షల 13,400 క్యూబిక్ మీటర్లు, పెరవలి మండలంలోని పందలపర్రులో అదే ఏడాది జనవరి 17 తేదీ నుంచి 7.72 హెక్టార్లలో 77,200 క్యూబిక్ మీటర్ల మేర, తీపర్రు గ్రామంలో అదే ఏడాది మే 30వ తేదీ నుంచి 9.9 హెక్టార్లలో 99వేల క్యూబిక్ మీటర్ల మేర, అదే తీపర్రులో మరోచోట అదే రోజు నుంచి 20.82 హెక్టార్లలో 2లక్షల 8వేల 200 క్యూబిక్ మీటర్ల మేర, అదే గ్రామంలో 2023 మే నెల 16వ తేదీ నుంచి 10.03 హెక్టార్లలో ఒక లక్షా 300 క్యూబిక్ మీటర్లు అదే ఏడాది అదే రోజు నుంచి ఇదే గ్రామంలో 46.27 హెక్టార్లలో 4లక్షల 62,700 క్యూబిక్ మీటర్ల ఇసుక అక్రమ తవ్వకాలు జరిగాయి. రాజమండ్రి రూరల్ మండలం పరిధిలోని తొర్రేడు గ్రామ పరిధిలో 2022 జనవరి 17న 5.86 హెక్టార్లలో 58వేల 600 క్యూబిక్ మీటర్ల మేర సీతానగరం మండలంలోని వంగలపూడి గ్రామ పరిధిలో అదే ఏడాది జనవరి 29న 10.64 హెక్టార్లలో 1లక్షా6వేల 400 క్యూబిక్ మీటర్ల మేర, కాటవరం గ్రామంలో అదే రోజు నుంచి 11.54 హెక్టార్లలో 1లక్షా15వేల 400 క్యూబిక్ మీటర్ల మేర అక్రమ ఇసుక తవ్వకాలు జరిగాయి. ఇక ప్రతిమ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ పేరిట తాళ్లపూడి మండలం పరిధిలోని బల్లిపాడు గ్రామంలో 2024 జూన్ 16న 10.01 హెక్టార్లలో 52వేల900 క్యూబిక్ మీటర్లు, పెరవలి మండలంలోని తీపర్రులో అదే ఏడాది అదే రోజు నుంచి 1.1 హెక్టార్లలో 1లక్షా 11వేల, 100 క్యూబిక్ మీటర్ల మేర అక్రమ తవ్వకాలు జరిగాయి. జిల్లాలో మొత్తం 20 లక్షల 7వేల 400 క్యూబిక్ మీటర్ల మేర అక్రమ ఇసుక తవ్వకాలు జరిగాయి.

- **టన్ను రూ.475 వంతున లెక్క**

జిల్లాలో మొత్తం 20 లక్షల 7వేల 400 క్యూబిక్ మీటర్ల మేర అక్రమ ఇసుక తవ్వకాలు జరిగాయి. వీటిని టన్నులలో లెక్కిస్తే 30లక్షల 11వేల 100 టన్నులు అవుతుంది. ఓపెన్ ర్యాంపుల పేరిట అప్పట్లో టన్ను ఇసుకకు రూ.475 వసూలు వైసీపీ వర్గాల పేరిట ఈ సంస్థలు వసూలు చేశాయి. టన్నుకు రూ.475 లెక్కన మొత్తం 30లక్షల 11వేల 100 టన్ను ఇసుక విలువ రూ.157 కోట్ల 2లక్షల, 72వేల 500 అయింది. ఈమేరకు మైన్స్ అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి అంటే మైన్స్ కమిషనర్‌కు నివేదిక పంపడంతోపాటు జేపీ, ప్రతిమా సంస్థలకు నోటీసులు జారీ చేశారు. వాస్తవానికి ఈ కంపెనీల పేరిట వైసీపీ నేతలే అధికంగా దోచుకున్న వైనం తెలిసిందే.



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న జేడీ నిర్మలా కుమారి

జీఎస్టీ సర్దుబాటుతో మత్స్యకార రంగానికి ఆర్థిక ఉపశమనం : మత్స్యశాఖ జేడీ

రాజానగరం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కొత్త జీఎస్టీ సర్దుబాట్లతో మత్స్యకార రంగానికి ఎంతో ప్రయోజనం చేకూరుతుందని జిల్లా మత్స్యశాఖ జేడీ ఎన్.నిర్మలాకుమారి పేర్కొన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలంలోని నరేంద్రపురం గ్రామంలో మంగళవారం జీఎస్టీ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మలాకుమారి మాట్లాడుతూ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ ప్రచారం ఈనెల 22 నుంచి అమల్లోకి వచ్చిందన్నారు. జీఎస్టీ రేట్లు తగ్గింపు ప్రయోజనాలను ఆక్వా రైతులు, మత్స్యకారులు, ఇతర వాటాదారులకు తెలియజేసేందుకు ఈ కార్యక్రమం చేపట్టారని వివరించారు. ముఖ్యంగా సముద్ర ఉత్పత్తులు, ప్రాసెస్ చేసిన చేసిన చేపలు, రొయ్యలు, చేప నూనెలు, సేంద్రియ సారములపై జీఎస్టీ 12 నుంచి 5 శాతానికి తగ్గించబడిందన్నారు. ఆక్వా కల్చర్ పరికరాలు, ఇన్‌పుట్ సబ్సిడీ, ఫిషింగ్ గేర్, అమ్మోనియా, సూక్ష్మ పోషకాలు, ప్రాసెసింగ్ సేవలపై కూడా జీఎస్టీ తగ్గింపు వర్తిస్తుందన్నారు. ఇప్పటికే ప్రభుత్వం ఏపీఎస్ఏడీఏలో నమోదు చేసుకున్న ఆక్వా రైతులకు యూనిట్ విద్యుత్‌కు రూ.1.50 వంతున రాయితీ అందిస్తోందన్నారు. నాన్ ఆక్వా జోన్లోని ఆక్వా ఫార్మర్లకు కూడా విద్యుత్ రాయితీ పొడిగింపు పరిగణలో ఉందని, ఈ సౌకర్యం ద్వారా ఎకరానికి సగటున రూ.20 వేలు ఆదా అవుతుందన్నారు. ఈ మార్పులు ఆక్వా రైతులు, ఎగుమతిదారులు ఎదుర్కొనే ఆర్థిక ఒత్తిళ్లను తగ్గించడమే కాకుండా స్థానిక మత్స్య ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం, భారతీయ ఎగుమతుల పోటీతత్వాన్ని పెంపొందించడంలో ముఖ్యపాత్ర పోషిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ సహాయ సంచాలకులు టి.సుమలత, అభివృద్ధి అధికారులు ఎస్.గణేశ్వరరావు, ఎం.బ్రహ్మానందం, అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ కె.హరీష్, సర్పంచ్ తంగెళ్ల మునలయ్య, మత్స్యకారుల సహకార సొసైటీ అధ్యక్షుడు బొర్రా ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

చింతాలమ్మకు ప్రత్యేక పూజలు

పెరవలి(ఆంధ్రజ్యోతి): దేవి నవరాత్రులు సందర్భంగా తీపర్రులో ఉన్న శ్రీ చింతాలమ్మ ఆలయంలో ప్రతిరోజూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. భవానీ మాల వేసిన పలువురు భక్తులు ఆలయం వద్ద వివిధ కార్యక్రమాలు చేస్తున్నారు. బుధవారం ఆలయం వద్ద అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

అతి వేగం లోడు

ప్రధాన రహదారిపై నిబంధనలు మీరి పరుగులు తీస్తున్న వాహనాలు స్థానికులను బెంబేలెత్తిస్తున్నాయి. ముఖ్యంగా క్వారీ, గ్రావెల్ లారీలు వేగంగా వెళ్తూ ప్రజల ప్రాణాలతో చెలగాట మాడుతున్నాయి. వాటిని కట్టడి చేయాల్సిన అధికారులు హెచ్చరికలకే పరిమితమవుతున్నారు. దీంతో పదేళ్ల పాటు ఉండాల్సిన రహదారులు ధ్వంసమైపోతున్నాయి.

- ప్రధాన రహదారిపై ఇష్టారాజ్యంగా క్వారీ లారీల రాకపోకలు
- బెంబేలెత్తిపోతున్న ప్రజలు
- ఛిద్రమవుతున్న రహదారులు



ఓవర్ లోడుతో వెళ్తున్న లారీ

గోకవరం, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతాల నుంచి నిత్యం అనేక క్వారీ లారీలు బండరాళ్లతో గోకవరం మీదుగా రాజమహేంద్రవరం వైపు వెళ్తుంటాయి. వైసీపీ హయాంలో అప్పటి నాయకులు వీటి రవాణా వ్యవహారాలు చూసుకునేవారనే ప్రచారం ఉంది. అప్పట్లోనే విచ్చలవిడిగా పరిమితికి మించిన బరువుతో క్వారీ లారీలు తిరుగుతుండేవి. వాటి కారణంగానే రోడ్లన్నీ గుంతలమయం అవుతున్నాయని ప్రజల నుంచి అనేక విమర్శలు వినిపించేవి. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా రవాణా నిర్వహణ బాధ్యత మారి ఉండవచ్చేమో గానీ నిబంధనల ఉల్లంఘనల్లో తీరు మాత్రం మారలేదు. ప్రతీ అరగంటకో, గంటకో భారీ బండరాళ్లతో లారీలు అతి వేగంతో తిరుగుతూనే ఉన్నాయి. వాటి వల్ల రహదారులు ఛిద్రమవుతున్నాయి. రవాణా శాఖ నిబంధనల ప్రకారం 12 టైర్ల లారీకి 20టన్నుల వరకు, 10 టైర్ల లారీకి 16టన్నుల వరకు రాళ్ల తరలించడానికి అనుమతులుంటాయి. డబ్బు ఆశతో వాహనదారులు పరిమితికి మించి క్వారీ రాళ్లను లోడ్ చేస్తున్నారు. 20 టన్నులు వేయాల్సిన టిప్పర్‌లో పరిమితికి మించి భారీగా నింపుతున్నారు. ఇంత బరువుతో వెళ్లే లారీలు రహదారిపై 30 నుంచి 40 కిలో మీటర్లు మించి వేగంతో వెళ్లరాదు, కానీ ఆ నిబంధ నలు వీరికి పని చేయవు. జనావాసాల మధ్య కూడా 50 కిలో మీటర్ల వేగం తగ్గకుండా నడు పుతున్నారు. సంత రోజులో కూడా అదే వేగంతో వాహనాలను నడపడం పరిపాటిగా మారింది.నిబంధనలను పాటించని క్వారీ వాహనాలను అదుపు చేయడానికి రవాణా, పోలీస్, గనులు, రెవెన్యూ, తదితర శాఖల అధికారులు సమన్వ యంతో పని చేయాల్సి ఉంది. కానీ అధికారలెవరూ ఆ దిశగా తనిఖీలు చేయరనేది బహిరంగ రహస్యం. క్వారీ లారీల వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తోందోనని గోకవరం ప్రజలు హడలెత్తిపోతున్నారు.



క్వారీ రాళ్లతో లోడు చేసిన లారీ



రహదారిపై లోడుతో వేగంగా వెళ్తున్న లారీ

పుష్కర్‌ఘాట్ నిత్యహారతి
సాయంత్రం వేళలో మార్పు

రాజమహేంద్రవరం కల్చరల్ సెప్టెంబరు30(ఆంధ్రజ్యోతి): స్థానిక పుష్కర్‌ఘాట్ వద్ద, సాయంత్రం 7గంటల నుంచి 7.20 వరకు నిర్వహించే గోదావరి నిత్యహారతి కార్యక్రమం వేళలో నిర్వాహకులు మార్పు చేశారు. శీతాకాలం సందర్భంగా భక్తుల సౌకర్యార్థం అక్టోబరు మాసమంతా సాయత్రం 6.30నుంచి 6.50వరకు జరుగుతుందని దేవదాయ ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి పి.విశ్వనాథరాజు ఒక ప్రకటనలో భక్తులకు తెలియజేశారు.

కోటసత్తెమ్మకు పూజలు

నిడదవోలు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలోని కోటసత్తెమ్మ దేవస్థానంలో మంగళవారం దేవీ నవరాత్రుల్లో భాగంగా దుర్గాష్టమి సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నిత్యాభిషేకం, ప్రత్యేక సహస్రనామ కుంకుమ పూజలు, చండీ పారాయణం, సాయంత్రం హోమం నిర్వహించారు. అమ్మవారికి జరిపిన కుంకుమ పూజల్లో సుమారు 392 మంది దంపతులు పాల్గొన్నారు.

వాసవీమాతకు మంత్రి పూజలు

నిడదవోలులో వాసవీమాతను మంత్రి కందుల దుర్గేష్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శరన్నవ రాత్రుల్లో వాసవీ కన్యకాపరమేశ్వరిని దర్శించుకోవడం ఎంతో సంతోషాన్ని కలిగించిందన్నారు. ఈ సందర్భంగా మంత్రి వెంట మునిసిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, కూటమి నాయకులు ఉన్నారు.

రేపు మహాకరుణ ధ్యాన మహాయజ్ఞం

మెగా శాకాహార సద్భావన ర్యాలీ వ్యక్తిత్వ జీవన సామాజిక ఆధ్యాత్మిక వికాస నిపుణుడు నాగిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న నాగిరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక సంస్థల ఆత్మీయ కలయికతో శ్రీవశిష్ట గౌతమి పిరమిడ్ ధ్యాన మహాశక్తి క్షేత్రం ఆధ్వర్యంలో ఈనెల 2న విజయదశమి, గాంధీ జయంతి సందర్భంగా రాజమహేంద్రవరంలో మహా కరుణ ధ్యాన మహాయజ్ఞం, మెగా శాకాహార సద్భావన ర్యాలీ నిర్వహిస్తున్నామని వ్యక్తిత్వ జీవన సామాజిక ఆధ్యాత్మిక వికాస నిపుణులు, ధ్యాన క్షేత్రం సంచాలకుడు దారపు నాగిరెడ్డి తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన మాట్లాడారు. 2వ తేదీ ఉదయం 8గంటలకు నుంచి సాయంత్రం 5గంటల వరకు వేలాది మంది ధ్యాన యోగులతో ఆర్ట్స్ కళాశాల గ్రౌండ్స్‌లో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు సంగిశెట్టి శ్రీనివాస్, చిట్టూరి సత్యనారాయమూర్తి, వాసు, విజయలక్ష్మి, అనిత, రత్నారెడ్డి, కృష్ణవేణి, రమేష్ పాల్గొన్నారు.

విద్యుత్ సర్దుబాటు చార్జీల తగ్గింపు దసరా కానుకే

టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ



రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం విద్యుత్ సర్దుబాటు చార్జీలను తగ్గించి రాష్ట్ర ప్రజలకు దసరా కానుక ఇచ్చిందని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ తెలిపారు. మంగళవారం ఆయన రాజమహేంద్రవరంలో ఒక ప్రకటన విడుదల చేశారు. వైసీపీ పాలనలో కుదేలైన విద్యుత్ రంగాన్ని కూటమి గాడిలో పెట్టిందన్నారు. యూనిట్‌కి 13పైసలు ట్రూడౌన్ చార్జీలు చేయడం ప్రజలపై భారాలను తగ్గించడమేనన్నారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో ప్రభుత్వ పనితీరుకు ఇదొక నిదర్శనమన్నారు. గత వైసీపీ ప్రభుత్వం సర్దుబాటు చార్జీలు పెంచడం వల్ల ప్రజలపై రూ.32 వేల కోట్లు అదనపు భారం పడిందని అందుకే ఎన్నికల్లో 11 సీట్లకే ప్రజలు పరిమితం చేశారన్నారు. సూపర్ సిక్స్ పథకాలు సమర్థవంతంగా అమలు చేస్తున్నారని చెప్పారు.

ఎల్ఐసీ ఏజెంట్ కుటుంబానికి ఆర్థికసాయం

రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఇటీవల రాజమహేంద్రవరం రూరల్ ఎల్ఐసీ ఏజెంట్ ఎం.ప్రదీప్ అనారోగ్యానికి గురయ్యాడు. ఏజెంట్లు సంఘం విషయాన్ని తెలుసుకుని ఆస్పత్రికి వెళ్లి వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యసేవలు అందించాలని కోరారు. ప్రదీప్ వైద్యానికి అవసరమైన రక్తం ఇచ్చారు. ఏజెంట్లు సంఘం అధ్యక్షుడు ఆదిమూలం సాయిబాబా పిలుపు మేరకు సంఘం ఏజెంట్లు నుంచి రూ.25 వేలు సేకరించారు. ఆసుపత్రికి వెళ్లి ఈ సొమ్మును మంగళవారం సాయిబాబా, డివిజన్ ఉపాధ్యక్షుడు జీకే చంద్రశేఖర్, మట్టా సత్యనారాయణ, యర్నాగుల రామ్మోహనరావు, ఈసీ మెంబర్లు కొత్త సత్యనారాయణ, కోన సతీష్ చేతుల మీదుగా ప్రదీప్ కుటుంబానికి అందజేశారు.

7న విజయవాడలో ఫ్యాప్టో పోరుబాట

విజయవంతం చేయండి రాష్ట్ర పరిశీలకుడు నరహరి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఫ్యాప్టో రాష్ట్ర పరిశీలకుడు నరహరి

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వం మొండి వైఖరికి నిరసనగా ఈనెల 7న విజయవాడ ధర్నాచౌక్‌లో వేలాది మంది ఉపాధ్యాయులతో పోరుబాట నిర్వహిస్తున్నామని ఫ్యాప్టో రాష్ట్ర పరిశీలకుడు కె.నరహరి(డీటీఎఫ్) పిలుపునిచ్చారు. మంగళవారం రాజమహేంద్రవరంలో ఫ్యాప్టో జిల్లా చైర్మన్ జేడీఐజే డేనియల్‌బాబు (ఎస్టీయూ) అధ్యక్షతన స్థానిక ఎన్జీవో హోంలో జరిగిన పోరుబాట సన్నాహక సమావేశానికి ఆయన విచ్చేసి మాట్లాడారు. కూటమి అధికారంలోకి వచ్చి 16నెలలు పూర్తయినా ఏ ఒక్క ఎన్నికల హామీ పూర్తిస్థాయిలో అమలు కాలేదన్నారు. రాష్ట్రంలో 12 లక్షల ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు సంబంధించిన ఒక్క సమస్య కూడా పరిష్కారం కాలేదన్నారు. సుమారు 30వేల కోట్ల ఆర్థిక బకాయిల చెల్లింపుపై ప్రభుత్వం రోడ్ మ్యాప్ ప్రకటించాలని కోరినా ఇంతవరకు స్పందన లేదన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు ప్రతి ఏడాది రూ.180 కోట్లు హెల్త్‌కార్డుల అమలు కోసం చెల్లిస్తున్నప్పటికీ హెల్త్‌కార్డుపై వైద్యానికి ఏ హాస్పిటల్‌లో అంగీకరించడం లేదన్నారు.ప్లస్ టూ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరతను భర్తీ చేయాలని, గురుకుల, ఆదర్శ, 1998, 2008 డీఎస్సీ ఎంటీఎస్ టీచర్ల పదవీ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని డిమాండ్ చేశారు. డేనియల్‌బాబు మాట్లాడుతూ కారుణ్య నియామకాల్లో జాప్యం వల్ల మృతిచెందిన ఉద్యోగుల వారసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సమస్యల పరిష్కారం కోసం చేస్తున్న పోరుబాటను విజయంతం చేయాలని పిలుపునిచ్చారు.తొలుత పోరుబాటు పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. సమావేశంలో సెక్రటరీ జనరల్ జయకర్, యూటీఎఫ్ కో చైర్మన్ శేషబ్రహ్మం, డీటీఎఫ్ డిప్యూటీ సెక్రటరీ జనరల్ లివింగ్‌స్టన్(ఏపీటీఎఫ్ 1938), డి.దుర్గారావు(ఏపీటీఎఫ్ 257), నాగరాజు (పీడీఅండ్‌పీఈటీ), కార్యవర్గ సభ్యులు షరీఫ్ ప్రకాష్, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

సూరంపాలెం నుంచి నీటి సరఫరాకు చర్యలు

- ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ
- ప్రాజెక్ట్ అధికారులతో కలిసి కణుపూరులో పర్యటన



రైతుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బత్తుల

కోరుకొండ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): సూరంపాలెం రిజర్వాయర్ నుంచి కణుపూరు గ్రామ రైతులకు సాగు నీరందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. సూరంపాలెం రిజర్వాయర్ ప్రాజెక్ట్ అధికారులతో కలిసి ఆయన కణుపూరు గ్రామంలో పర్యటించి రైతుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెలే మాట్లాడుతూ మండలంలోని కణుపూరుకు సూరంపాలెం రిజర్వాయర్ ద్వారా సాగు నీరు రావాలి.కానీ రిజర్వాయర్‌లో నీటి నిల్వ తక్కువ ఉన్నందున కాలువ ద్వారా నీటిని విడుదల చేయలేదు. దీంతో గ్రామంలో 60 ఎకరాలకు సాగునీరందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కూటమి నాయకుల ద్వారా విషయం తెలుసుకుని పొలాలను సూరంపాలెం రిజర్వాయర్ డీఈ, ఏఈలతో కలిసి పరిశీలించామన్నారు. స్థానికంగా ఉన్న ఊర చెరువు కూడా పూర్తిగా పూడికతో నిండిపోవడం వల్ల నీటిని నిల్వ చేయడానికి తగినంత సామర్థ్యం లేదని, రైతులను ఆదుకునేందుకు సొంత నిధులతో సూరంపాలెం కాలువ పూడిక తీయించి సాగునీరందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. చెరువుల నిల్వ సామర్థ్యం పెంచడానికి పూడిక తీతలు, తూముల మరమ్మతులు చేయిస్తామన్నారు. సూరంపాలెం రిజర్వాయర్ అధికారులు కూడా పూర్తి సహకారం అందిస్తున్నారన్నారు. రూ.32 కోట్లతో రైతులకు సక్రమంగా సాగు నీరందించేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. కణుపూరుకు పుష్కర కాలువ ద్వారా కూడా ఒక లిఫ్ట్ ఏర్పాటు చేసి త్వరలోనే సాగునీరందించేలా చర్యలు చేపట్టామన్నారు. నియోజకవర్గంలో చివరి ఎకరా వరకు సాగునీటిని అందించడానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బత్తుల అన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న బత్తుల వెంకటలక్ష్మి

కోరుకొండ, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సిఫార్సులతో మంజూరయిన సీఎం సహాయ నిధి ఆర్థిక సాయం చెక్కుల పంపిణీని మంగళవారం కోరుకొండ కార్యాలయంలో జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు కమిటీ రాష్ట్ర కో ఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి పంపిణీ చేశారు. బూరుగుపూడికి చెందిన ఒకరికి రూ.65,798, కాపవరానికి చెందిన బయ్యే ప్రసాద్‌కు రూ.50,277, జంబుపట్నం గ్రామానికి చెందిన దొంగల సత్యనారాయణకు రూ.42,833, గాదరాడ గ్రామానికి చెందిన కామిశెట్టి మణికంఠ స్వామికి రూ.61,800, మామిడి క్రాంతికుమార్‌కు రూ.90,024, శ్రీరంగపట్నం గ్రామానికి చెందిన కమ్మిలి రాజబాబుకు మంజూరైన రూ.35,227 చెక్కులను వెంకటలక్ష్మి అందజేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు అడపా శ్రీనివాస్, అడ్డాల శ్రీనివాసు, బదిరెడ్డి దొర, జాజుల రాము, కర్రి వీరగణేష్, తాటికొండ శ్రీను, తాటికొండ బుజ్జి పాల్గొన్నారు.

ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

రంగంపేట, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మానవుడికి సంపద కన్నా ఆరోగ్యం మిన్న అని, ప్రతిఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కూటమి నాయకుడు పుట్టా సోమన్నచౌదరి అన్నారు. మంగళవారం మండలంలోని మర్రిపూడి గ్రామ సచివాలయం వద్ద జరిగిన స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ కార్యక్రానికి ఆయన విచ్చేసి ప్రసంగించారు. ఈ కార్యక్రమం వల్ల మహిళలకు ఎంతో మేలు జరుగుతుందని, రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో అమలు చేస్తోందని పేర్కొన్నారు. పీహెచ్‌సీ డాక్టర్లు సమ్మెలో ఉండడం వల్ల సింగంపల్లి పీహెచ్‌సీ పరిధిలోని మర్రిపూడి ఆయుష్మాన్ భవ సిబ్బంది ఈ వైద్యశిబిరాన్ని నిర్వహించారు. పలువురికి ఆరోగ్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పిటి చౌదరి, పుట్టా వెంకటేశ్, తమ్మారావు, ప్రసాద్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

డిసెంబరు 13న బ్రాహ్మణ యువతకు జాబ్ మేళా



పోస్టర్ ఆవిష్కరిస్తున్న బ్రాహ్మణ సంఘ నాయకులు

రాజమహేంద్రవరం కల్చరల్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఏపీ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఆధ్వర్యంలో డిసెంబరు 13న గుంటూరు హిందూ కాలేజీ ఆఫ్ ఫార్మసీలో బ్రాహ్మణ యువతకు జాబ్ మేళా జరుగుతుందని బ్రాహ్మణ సంఘం నగర అధ్యక్షుడు పుచ్చా సూర్య వెంకటరావు తెలిపారు. ఈ మేరకు రాజమహేంద్రవరం కోటిపల్లి బస్టాండ్ సమీపంలోని బ్రాహ్మణ సమాఖ్య ప్రాంతీయ కార్యాలయంలో సంఘ నాయకులు పోస్టర్‌ను ఆవిష్కరించారు. బ్రోచర్లో ఉదహరించిన క్యూ ఆర్ కోడ్ ద్వారా నవంబరు 23వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని చెప్పారు.వివరాలకు సంఘ సమాఖ్య ప్రాంతీయ కార్యాలయంలో లేదా 98482 06020కు ఫోను లేదా వాట్సప్ ద్వారా సంప్రదించవచ్చని వెంకటరావు తెలిపారు. కార్యక్రమంలో కలగ ప్రభాకరం, భాగవతి నారాయణ శాస్త్రి, వాడ్రేవు వేణుగోపాలరావు పాల్గొన్నారు.

భవనం నుంచి జారిపడి
యువకుడి మృతి

బిక్కవోలు, సెప్టెంబరు (ఆంధ్రజ్యోతి): అనపర్తికి చెందిన బురిడి శ్రీను(36) ప్రమాదవశాత్తూ భవనం రెండో అంతస్తు నుంచి కాలు జారి మృతి చెందాడు. ఎస్ఐ వి.రవిచంద్రకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీను రాడ్ బెండింగ్ పని చేస్తుంటాడు. మంగళవారం ఉదయం పనికి బలభద్రపురం వచ్చి రెండో అంతస్తులో పని చేస్తుండగా కాలు జారి పడ్డాడు. దీంతో తలకు తీవ్రగాయాలు కావడంతో అతడిని అనపర్తి ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. శ్రీను భార్య పిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ పేర్కొన్నారు.

త్వరలో 'కిమ్స్' 400 పడకల ఆసుపత్రి

80% వైద్యం ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారానే.. ఈడీ రామ్మోహనరావు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఈడీ

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక వై.జంక్షన్ వద్ద నూతనంగా నిర్మిస్తున్న కిమ్స్ 400 పడకల ఆస్పత్రిని త్వరలోనే అందుబాటులోకి తీసుకొస్తామని ఆస్పత్రి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ స్వర్ణ రామ్మోహన్‌రావు తెలిపారు. వరల్డ్ హార్ట్ డే సందర్భంగా హెల్తీ హార్ట్‌పై 3రోజులుగా నిర్వహిస్తున్న ఉచిత ప్రజా అవగాహన సదస్సులు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఈడీ మాట్లాడుతూ బొల్లినేని కిమ్స్ ఆస్పత్రిలో 80% వైద్య సేవలు ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు ద్వారా అందిస్తున్నామన్నారు. మూడు రోజుల సదస్సుల్లో వెయ్యి మందికి ఉచిత స్క్రీనింగ్ పరీక్షలు చేశామని, కార్డియాక్ డాక్టర్లు కౌన్సెలింగ్ చేశారని ఆయన చెప్పారు. 8 మందికి ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు ద్వారా వైద్యం అందించామన్నారు. ఆస్పత్రి గుండె వైద్య నిపుణుడు డాక్టర్ రామరాజు మాట్లాడుతూ మంచి ఆహారపు అలవాట్లు, జీవనశైలిలో మార్పులు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండడం ద్వారా గుండెను కాపాడుకోవచ్చన్నారు.అనంతరం ప్రజాప్రతినిధులను సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్లు సతీశ్, పణితేజ, రేవంత్ పద్మశ్రీ, కృష్ణశ్రీ, మణికంఠ పాల్గొన్నారు.

సాంబారు గిన్నెలో పడి
బాలుడికి తీవ్ర గాయాలు

దేవరపల్లి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యర్నగూడెం గ్రామంలో ప్రమాదవశాత్తూ బాలుడు సాంబారు గిన్నెలో పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన పనిశెట్టి గంగాభవాని కర్రీ పాయింట్ నడుపు తున్నారు. ఆమెకు ఇద్దరు పిల్లలు. మంగళవారం ఉదయం కర్రీ పాయింట్ కోసం కూరలు సిద్ధం చేస్తుండగా చిన్నకుమారుడు చరణ్ ఆడుకుంటూ వెళ్లి ప్రమాదవశాత్తూ సాంబారు గిన్నెలో కూర్చోవడంతో పొట్ట కింద భాగం కాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. టీడీపీ నాయకుడు పెనుమత్స సుబ్బరాజు అంబులెన్స్‌లో రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి చరణ్‌ను తరలించి వైద్యం అందిస్తున్నారు. ప్రస్తుతం బాలుడు ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు.

దుర్గాదేవిగా దర్శనమిచ్చిన శ్రీరాజరాజేశ్వరి

అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు
ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు



రావి ఆకుపై అమ్మవారి రూపం

బిక్కవోలు, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గ్రామంలోని జువ్వలదొడ్డిలో ఉన్న శ్రీరాజరాజేశ్వరి పీఠంలో మంగళవారం అమ్మవారు దుర్గాదేవి అవతారంలో దర్శనమిచ్చారు. ఈ అవతారంలో అమ్మవారిని పూజించడం వల్ల శత్రువుల బాధ తొలగుతుందని పీఠాధిపతి దేవరభొట్ల ప్రభాకరశర్మ చెప్పారు. కరణం గారి మేడలో రాజరాజేశ్వరి అమ్మవారికి లక్ష కుంకుమార్చన జరిపారు. కొంకుదురులో భారీ ఎత్తున కన్యారాధన నిర్వహించారు. ముందుగా 108 మంది కన్యలు గ్రామోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం వీరితో అమ్మవారికి కన్యారాధన జరిపారు.



కొంకుదురులో గ్రామోత్సవంలో పాల్గొన్న కన్యలు

ఇంద్రకీలాద్రిపై నల్లమిల్లి పూజలు



విజయవాడలో ఎమ్మెల్యే నల్లమిల్లికి అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

అనపర్తి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రుల సందర్భంగా విజయవాడ ఇంద్రకీలాద్రిలో కనక దుర్గమ్మను మంగళవారం ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మహాలక్ష్మి దంపతులు కుమారుడు మనోజ్‌రెడ్డి, కుమార్తె సనాతనిలతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు ప్రత్యేక పూజలు నిర్వహించగా వేద పండితులు ఆశీర్వచనాలు అందజేశారు. ఆలయాధికారులు ఎమ్మెల్యే దంపతులకు అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. ఇదిలా ఉండగా అనపర్తి జీబీఆర్ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ కంప్యూటర్స్ చదువుతున్న భద్రిరాజు లక్ష్మీ సుప్రజా పార్వతి రావి ఆకుపై అమ్మవారి చిత్రాన్ని రూపొందించి తన భక్తిని చాటుకున్నారు. విజయ దశమి సందర్భంగా అమ్మవారి రూపాన్ని వినూత్నంగా తయారు చేయాలన్న సంకల్పంతో రావి ఆకుపై రూపొందించినట్టు ఆమె పేర్కొన్నారు.

సార్..దసరా మామూలు

- ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల ఉద్యోగుల వసూళ్లు
- డిమాండ్ చేస్తున్న కొందరు సిబ్బంది
- ఇబ్బందుల్లో సామాన్య, మధ్య తరగతి ప్రజానీకం



దివాన్‌చెరువు, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): దసరా పండుగ వచ్చిందన్న సరదా మాట అలా ఉంచితే... దసరా మామూళ్ల రూపంలో చేతిచమురు వదులుతుంటే అమ్మో-- దసరా అని పిస్తోందని పలువురు వాపోతున్నారు. విజయ దశమి దగ్గర పడుతుండడంతో ఈ తరహా వసూళ్ల మరీ ఎక్కువగా కనిపిస్తున్నాయి. దసరాకు వస్తిమని వినవినలు పడక.. చేతిలో లేదని అప్పు ఇవ్వరు అనక అనే దసరా పద్యాలు ఇటీవల కొంత కాలంగా వినపడక పోయినప్పటికీ దసరా మామూళ్ల అంటూ కొంతమంది ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు డిమాండ్ చేసి మరీ వసూళ్ల మాత్రం సాగుతున్నాయని ఆవేదన చెందుతున్నారు. దసరా పండుగకు దాదాపు నెలరోజుల ముందు నుంచే వివిధ శాఖల ఉద్యోగులు పుస్తకాలు పుచ్చుకుని ప్రత్యక్షం అవుతున్నారని పలువురు అంటున్నారు. ఈ విధంగా దసరా మామూళ్ల వసూలు చేసే వారిలో స్థానిక సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు నుంచి ప్రారంభమై నిత్యం ప్రజలతో ఏదో విధంగా సంబంధం ఉండే వివిధ శాఖల సిబ్బంది కుడా ఉండడంతో యజమానులకు తమ చేతిచమురు వదుల్చుకోక తప్పడం లేదు. ఇక వేలకు వేలు ఫీజులు వసూలు చేసే ప్రైవేట్ విద్యా సంస్థల్లో చదివే పిల్లలు తల్లిదండ్రులకు కూడా ఈ బెడద తప్పడంలేదు. అంతేకాదు ప్రైవేట్ పాఠశాలల్లో చదివే చిన్నారులు పాఠశాలకు వెళ్లి వచ్చే కొన్ని బస్సుల డ్రైవర్లు, క్లీనర్లకు కూడా దసరా మామూళ్ల ఇవ్వడం మామూలైపోయిందని చలోక్తులు విసురుతున్నారు. దీనికి తోడు తమ ఇంటి వద్ద, గ్రామాల్లోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసే మందిరాలు వద్ద కుడా చందాలు చెల్లించవలసి రావడంతో ఒక్కొక్క కుటుంబానికి తక్కువ అనుకుంటే నాలుగు నుంచి ఐదు వేలు రూపాయల వరకూ ఖర్చు అయిపోతోందని వాపోతున్నారు. వందో, రెండొందలో ఇస్తే తీసుకోవడం లేదని, మా టీం ఎక్కువ మంది ఉన్నాం కనీసం వెయ్యి రూపాయలైనా ఇవ్వండి అంటూ కొంతమంది ఉద్యోగులు, ఇదిగో మీ పాత పద్దు దీనికి తగ్గిస్తే ఎలా అంటూ మరి కొంతమంది ఇబ్బంది పెడుతున్నారని పలువురు నుంచి ఆవేదన వ్యక్తం అవుతోంది.. సిబ్బంది అందించిన సేవలను దృష్టిలో ఉంచుకుని తమకు తోచినంత ఇస్తుంటే తీసుకోవడం లేదని కొందరు వాపోతున్నారు. కొన్ని ప్రభుత్వ శాఖలలోని కొంతమంది ఉద్యోగులు సైతం ఈ విధంగా మాముళ్ల దండుకోవడాన్ని నియంత్రించేవారెవరూ కానరావడంలేదని, వారు అడిగిన తరువాత మామూళ్ల ఇవ్వకపోతే సేవలు అందించడంలో తమను ఇబ్బంది పెడతారేమోనన్న భయంతో ఆర్థిక భారమైనా భరించక తప్పడం లేదని పలువురు సామాన్య, మధ్య తరగతి వారు అంటున్నారు.

వదలని వరద..!

- మళ్లీ పెరుగుతున్న గోదావరి, శబరి ఉధృతి
- నీటిలోనే విలీన మండలాల గ్రామాలు
- చెరువులను తలపిస్తున్న రహదారులు
- నీటమునిగిన గండిపోశమ్మ ఆలయం

చింతూరు/దేవీపట్నం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): గోదావరి, శబరి ఉధృతి మళ్లీ పెరుగుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటలకు చింతూరు వద్ద శబరి 34 అడుగుల మేర ప్రవహించింది. భద్రాచలంలో గోదావరి 50 అడుగుల నీటి మట్టం, కూనవరం వద్ద 46 అడుగుల నీటిమట్టం ఉంది. దీంతో విలీన మండలాల్లో పలు ప్రధాన రహదారులపై వరద నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. వడ్డిగూడెం, కూనవరం, పోట్లవాయి, మొరుమూరు తదితర గ్రామాల్లో లంక పొగాకు, మిర్చి నారుమడులు వరద పాలయ్యాయి. చింతూరు మండలంలో వరి సాగు నీటమునిగింది. చింతూరు డివిజను వ్యాప్తంగా 80 గ్రామాలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. దేవీపట్నం మండలంలో గోదావరి ముంపు పరీవాహక ప్రాంతాలైన కొండమొదలు, పూడిపల్లి తదితర గ్రామాల్లో వరద నీరు చేరింది. పుణ్యక్షేత్రం మాతృశ్రీ గండిపోశమ్మ ఆలయం పూర్తిగా మునిగిపోయింది. దండంగి వద్ద ఉన్న సీతపల్లి వాగుకు వరద నీరు చేరడంతో ప్రభుత్వ కార్యకలాపాలకు గండిపై ఉన్న 4పంచాయతీల ప్రజలు తీవ్రఇబ్బందులు పడుతున్నారు.


జలమయమైన చింతూరు, వరరామచంద్రపురం మండలాల నడుమ ప్రధాన రహదారి


కూనవరంలోని గిన్నెల బజారులో ఇంట్లోకి నీళ్లు రావడంతో బాధితులను తరలిస్తున్న అధికారులు


దేవీపట్నం: పూర్తిగా నీటమునిగిన గండిపోశమ్మ అమ్మవారి ఆలయం


కూనవరం: పొట్లవాయిలో ఇంట్లోకి వరదనీరు రావడంతో సామగ్రిని బయటకు తీసుకువస్తున్న బాధితుడు

ముంపులో మిర్చి సాగు


ఎటపాక: నెల్లిపాకలో ముంపునకు గురైన మిర్చి పంట

కూనవరం/ఎటపాక, సెప్టెంబరు 30 (ఆంధ్ర జ్యోతి): గోదావరి ఉధృతికి అల్లూరి జిల్లా కూనవరం మండలంలోని పొట్లవాయి గ్రామంలో సుమారు 400 ఎకరాలకుపైగా మిర్చి పంట మునిగిపోయింది. మిరప మొక్కలు చనిపోయాయి. దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మొక్క దశలోనే ఎకరానికి రూ.30వేల నుంచి 35 వేల వరకు ఖర్చయిందని చెప్తున్నారు. ఇప్పటికే అప్పులు తీసుకుని సాగు చేస్తున్నామని, పంటలు మునిగి పోవడంతో తీవ్రంగా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూనవరం మండలంలోని పలు గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. మంగళవారం చింతూరు వైపు వెళ్లే రహదారిలో పంద్రాజుపల్లి వద్ద ప్రధానరహదారిపై వరద నీరు చేరింది. దీంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఎటపాక మండలంలో సుమారు 100 ఎకరాల మిర్చిపంట ముంపు బారినపడింది. భద్రాచలం- కూనవరం రోడ్‌లో మురుమూరు, నెల్లి పాక, రాయ నపేట వద్ద రహదారి ముంపుకు గురై రాకపోకలు ఆగాయి. నెల్లిపాక- వీరాయి గూడెం గ్రామాల మధ్యలో రోడ్డుపై నీరు చేరింది.


ఆలమూరు మండలం జొన్నాడ పుష్కర్‌ఘాట్ వద్ద ఉధృతంగా గోదావరి ప్రవాహం

లంక గ్రామాల్లోకి వరద నీరు

- ఆందోళనలో రైతులు
- పర్యటించిన అధికారులు

ఆలమూరు/ఆత్రేయపురం/కపిలేశ్వరపురం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): గోదావరికి వరద నీరు పోటెత్తడంతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలంలోని పుష్కర్‌ఘాట్‌లతోపాటు లంక గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాలను వరదనీరు ముంచేసింది. మండలంలోని జొన్నాడ, బడుగువానిలంక పుష్కర్‌ఘాట్లు మునిగిపోయ్యాయి. బడుగువానిలంక, మడికి, చెముడులంక, చొప్పెల్ల, మూలస్థానం, జొన్నాడ, ఆలమూరు లంక భూముల్లో వాణిజ్యపంటలు ముంపునకు గురయ్యాయి. మరింత పెరిగితే లంక గ్రామాల్లో పంటలకు భారీ నష్టం ఉంటుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జొన్నాడ వద్ద రెండు బ్రిడ్జిల మధ్య గోదావరి వరద ఉధృతిగా ప్రవాహిస్తుంది. ఆత్రేయపురం మండలం బొబ్బర్లంక కాటన్ బ్యారేజీ వద్ద గోదావరి గౌతమి, వశిష్ట నదులు వరద నీటితో ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. మంగళవారం సాయంత్రానికి బొబ్బర్లం క బ్యారేజీ వద్ద 12.40 అడుగులకు వరద నీరు చేరుకుంది. భద్రాచలం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వరద ప్రవాహం పెరగడంతో కపిలేశ్వరపురం మండలంలోని లంకగ్రామాలైన కేదార్లంక, వీధివారిలంక, నారాయణలంక, అద్దం కివారిలంక, పల్లపులంకలో మంగళవారం తహశీల్దార్ జి. శ్రీనివాస్ ఆధ్వర్యంలో అధికారుల బృందం పర్యటించింది. ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. వరద పరిసితులపై సమీక్ష నిర్వహించారు.


కపిలేశ్వరపురం మండలం కేదార్లంకలో సమీక్షిస్తున్న తహశీల్దార్ శ్రీనివాస్

రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి



తుని రూరల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం రైల్వేస్టేషన్‌లో మంగళవారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. స్టేషన్ మాస్టర్ సమాచారం మేరకు రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకు న్నారు. సుమారు 40 ఏళ్ల వ్యక్తి 2వ నెంబరు ప్లాట్‌ఫాంపై బెంచి కింద మృతిచెంది ఉన్నట్టు రైల్వే ఇన్‌చార్జ్ సబ్ ఇన్‌స్పెక్టర్ వాసు తెలిపారు. మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించి మార్చురీలో భద్రపరిచినట్టు చెప్పారు. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే రైల్వే పోలీసులను 9490619020లో సంప్రదించాలని కోరారు.

అత్యాచారం కేసులో నిందితుడి అరెస్టు

అంతర్వేది, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేదిపల్లిపాలెం గ్రామంలో 9నెలల క్రితం నమోదైన అత్యాచారం కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్టు రాజోలు సీఐ టీవీ నరేష్‌కుమార్ తెలిపారు. తనను బలాత్కారం చేశాడని అప్పట్లో మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి నిందితుడు కొప్పాడి జగదీష్ పరారీలో ఉండి ప్రస్తుతం స్వగ్రామానికి వచ్చిన అందిన సమాచారం మేరకు పోలీసులు అరెస్టు చేసినట్టు తెలిపారు.

సాంబారు గిన్నెలో పడి బాలుడికి తీవ్రగాయాలు

దేవరపల్లి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం యర్నగూడెంలో ప్రమాదవశాత్తూ బాలుడు సాంబార్ గిన్నెలో పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. యర్నగూడెం గ్రామానికి చెందిన పనిశెట్టి గంగాభవాని కర్రీ పాయింట్ నడుపుతుంది. ఆమెకు ఇద్దరు పిల్లలు. మంగళవారం ఉదయం కర్రీ పాయింట్ కోసం కూరలు సిద్ధం చేస్తుండగా చిన్నకుమారుడు చరణ్ ఆడుకుంటూ ప్రమాదవశాత్తూ సాంబారు గిన్నెలో పడిపోవడంతో పొట్ట కిందభాగం కాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. టీడీపీ నాయకులు పెనుమత్స సుబ్బరాజు అంబులెన్స్‌లో రాజమహేంద్రవరం ప్రైవేటు ఆసుపత్రికి చరణ్‌ను తరలించారు. చరణ్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని కుటుంబసభ్యులు తెలిపారు.


గాయపడిన చరణ్

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

I, BORRA VEERA VENKATA KANAKA DURGA DEVI W/O BORRA RAMESH, R/O 62-13-185, MAHALKSHMI NAGAR, TURANGI, JAGANNADHAPURAM, KAKINADA (URBAN), DIST EAST GODAVARI, AP-533002, NOW CHANGED MY NAME FROM BORRA DEVI TO BORRA VEERA VENKATA KANAKA DURGA DEVI W/O BORRA RAMESH. HENCE FORTH I WILL BE CALLED AS BORRA VEERA VENKATA KANAKA DURGA DEVI FOR ALL PURPOSE

AJZ 256018

4 Lines CLASSIFIED Rs.230/- Only


గంజాయితో ఇద్దరిని పట్టుకున్న కోరుకొండ పోలీసులు

408 కిలోల గంజాయి పట్టివేత

ఇద్దరి అరెస్ట్

కోరుకొండ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం బూరుగుపూడి గేటు వద్ద పోలీసులు 10 బస్తాల గంజాయి స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్ట్ చేశారు. దీనికి సంబంధించిన వివరాలను సీఐ వై.సత్యకిషోర్ మంగళవారం సాయంత్రం కోరుకొండ పోలీస్‌స్టేషన్ వద్ద మీడియాకు వెల్లడించారు. జిల్లా ఎస్పీ నరసింహకిషోర్ ఆదేశాల మేరకు బూరుగుపూడి చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా కత్తిపూడి నుంచి ఒక వ్యానులో చెన్నైకి తరలిస్తున్న 408 కిలోల బరువున్న 10 బస్తాల గంజాయిని ఎస్ఐ నాగార్జున, సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. దాని విలువ రూ.22 లక్షలు. ఈ గంజాయిని కత్తిపూడి వద్ద బ్రిడ్జి దాటిన తరువాత వ్యాన్‌లో ఎక్కించి తరలిస్తున్నారని, అయితే రాజానగరం వద్ద పోలీస్ తనిఖీలు జరుగుతున్నాయన్న సమాచారంతో వ్యాన్‌ను దోసకాయలపల్లి, బూరుగుపూడి మీదుగా రూటు మళ్లించారని, బూరుగుపూడి గేటు వద్ద వాహనాన్ని ఆపకుండా పరారవుతున్న నేపథ్యంలో పోలీసులు చాకచక్యంగా వ్యాన్‌ను ఆపి తనిఖీ చేయడంతో గంజాయి దొరికింది. దీంతో తమిళనాడుకు చెందిన ఆనింది సెల్వా వేల్మురగన్ (30), నాగేంద్రన్(38)పై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశామని సీఐ తెలిపారు. వీరి ద్వారా కత్తిపూడి పరిసరాల్లో కుమార్ అనే వ్యక్తి గంజాయిని చెన్నైకి పంపిస్తున్నాడని చెప్పారు.

పాత విద్యా విధానాన్నే కొనసాగించాలి

- అఖిల భారత రైతుకూలీ సంఘం
- ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు రమణ

రంపచోడవరం, సెప్టెంబరు 30 (ఆంధ్ర జ్యోతి): పాత విద్యా, విద్యుత్ విధానాన్నే కొనసాగించాలని అఖిల భారత రైతుకూలీ సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఉపాధ్యక్షుడు ఐవిరమణ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. మంగళవారం రంపచోడవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో పీడీఎస్‌యూ, పీవైఎల్ డివిజన్ కార్యవర్గం ఆధ్వర్యంలో మహాత్మ జోతిబా పూలే స్థాపించిన సత్య శోధక్ సమాజం ఆవిర్భావ దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ ప్రైవేట్ ఆసుపత్రులు మార్చే క్రమంలో పీ-4 పేరుతో ప్రైవేటీకరణకు ఇచ్చినట్టుగా విద్యుత్ రంగాన్ని అదాని, అంబానీ వంటి కంపెనీలకు ఇచ్చే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. విద్యుత్ నినియోగదారులు, రాష్ట్ర ప్రజలు న్యాయవ్యవస్థ కలిసి పోరాటం చేయడం ఫలితంగానే ట్రూడౌన్ పేరుతో విద్యుత్ చార్జీలు తగ్గించారన్నారు. ఏజెన్సీ డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలని, ఆదివాసీ చట్టాలు అమలు చేయాలని ఆదివాసీ విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 13న ఐటీడీఏ కార్యాలయంలో చేపట్టే ఐక్య ధర్నాకు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ, పీవైఎల్ డివిజన్ కార్యవర్గ సభ్యులు ఎం.ప్రసాద్‌దొర, పి.లక్ష్మణ్, డి.నాగరాజు, పి.మార్క్‌రెడ్డి, ఎం.అబ్బాయిరెడ్డి, ఎం.మురళీ, వి.వాసు,రత్నాకర్ ఉన్నారు.

'కుల రహిత సమాజాన్ని నిర్మించాలి'

రంపచోడవరం, సెప్టెంబరు 30 (ఆంధ్ర జ్యోతి): సమాజాన్ని పట్టి పీడిస్తున్న కుల, వర్ణ, జాతి, దోపిడీ, పీడనకు వ్యతిరేకంగా ప్రజలు ఐక్యంగా కుల రహిత సమాజాన్ని నిర్మించుకోవాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి కుంజా దూలయ్య పిలుపునిచ్చారు. మంగళవారం రంపచోడవరం మార్క్స్-ఎంగెల్స్ భవనంలో పార్టీ డివిజన్ నాయకుడు పల్లాల అశోక్‌కుమార్ అధ్యక్షతన కుల నిర్మూలన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా దూలయ్య మాట్లాడుతూ జ్యోతిపూలే స్థాపించిన సత్యశోదక్ సమాజ్ 152వ ఆవిర్భావం పురస్కరించుకుని సదస్సు నిర్వహించామన్నారు. హిందూ పాపిస్టు పాలకుల-సర్వం ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ దళితులు, ఆదివాసీలు, పేదల రాజ్యాంగ పరిరక్షణ హక్కుల కోసం పోరాడాలన్నారు. ఏఐకేఎంఎస్ డివిజన్ కార్యదర్శి పల్లాల లచ్చిరెడ్డి మాట్లాడుతూ కులం, మతం పేరుతో పేదలను విభజించి దోపిడీ, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారన్నారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు కత్తుల బాలిరెడ్డి, ఐ.వి.రమణ, సీహెచ్ మాధవరెడ్డి, కె.రాములమ్మ పాల్గొన్నారు.

ర్యాలిలో పిచ్చికుక్క స్వైరవిహారం

20 మందిపై దాడి

ఆత్రేయపురం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం ర్యాలి గ్రామంలో పిచ్చికుక్క స్వైరవిహారం చేస్తూ పలువురిపై దాడికి పాల్పడింది. గత 10 రోజులుగా ఈ పిచ్చికుక్క సుమారు 20 మందిపై దాడి చేసి గాయపరచడంతో గ్రామస్తులు భయాందోళనకు గురువుతున్నారు. ఈ కుక్కకు రాబీస్ వ్యాధి సోకిందోమేనని భయాందోళన చెందుతున్నారు. సోమవారం సాయంత్రం రెండేళ్ల బాలుడిపై పిచ్చికుక్క దాడి చేసి గాయపరిచింది. కుటుంబసభ్యులు వెంటనే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. గ్రామంలో పిచ్చికుక్క స్వైరవిహారంతో ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

'ఈకేవైసీ తప్పనిసరి'

రాజవొమ్మంగి, సెప్టెంబరు 30 (ఆంధ్ర జ్యోతి): జాతీయ ఉపాధిహామీ పథకం వేతనదారులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని ఏపీవో శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఆయన విడుదలచేసిన ప్రకటలో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి వేతనదారుడు ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. అక్టోబరు 10లోపు సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్ల వద్ద ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు.

రాజవొమ్మంగి పీహెచ్‌సీ తనిఖీ

రాజవొమ్మంగి, సెప్టెంబరు 30 (ఆంధ్ర జ్యోతి): రాజవొమ్మంగి పీహెచ్‌సీని ఎంపీడీవో యాదగిరేశ్వరావు మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని రికార్డులను పరిశీలించారు. రోగులతో మాట్లాడుతూ వారికి అందుతున్న వైద్యసేవల తీరుపై ఆరా తీశారు.

రాయవరం రాళ్ల దాడి కేసులో ఇద్దరి అరెస్టు


రాయవరం పోలీస్‌స్టేషన్‌లో నిందితుల అరెస్ట్ చూపుతున్న సీఐ దొరరాజు

రాయవరం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం ముత్యాలమ్మ ఆలయం వద్ద సరిహద్దు వివాదం నేపథ్యంలో వెలమసంఘం సభ్యులపై సరిహద్దు ఇంటికి చెందిన వ్యక్తులు ఈనెల 28న రాళ్ల దాడికి పాల్పడగా దాడిలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బొదంకి సత్యనారాయణ మృతిచెందగా, మరో ఏడుగురు గాయాలపాలయ్యారు. ఈ కేసులో ఇద్దరు నిందుతులను అరెస్టు చేసినట్టు మండపేట రూరల్ సీఐ పి.దొరరాజు తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. రాయవరం పోలమ్మ ఆలయం సమీపంలో పంచాయతీకి చెందిన సత్రం ఉండేది. ఆ సత్రం సమీపంలో రావిచెట్టు కింద్ర ముత్యాలమ్మ విగ్రహం పెట్టి చాలాకాలం నుంచి వెలమ సంఘం సభ్యులు పూజలు చేస్తున్నారు. సత్రం పాడుపడడంతో ఆ స్థలంలో అమ్మవారి ఆలయం నిర్మించాలని వెలమ సంఘం సభ్యులు 2023లో పనులు ప్రారంభించారు. సత్రం వెనుక ఇంటికి చెందిన రేలంగి నాగేశ్వరరావు ఆ స్థలం తనకు చెందినదని, తాను మాత్రమే వాడుకోవాలని చెప్పడంతో వివాదం నడుస్తుంది. ఈ నేపథ్యంలో ఇక్కడ ఎటువంటి కట్టడాలు జరపరాదంటూ నాగేశ్వరరావు కోర్టును ఆశ్రయించాడు. ఆ స్థలం సర్వే చేసి ఎవరిదో తేల్చాలని కోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో దసరా ఉత్సవాలు పురస్కరించుకుని ఈనెల 28న వెలమ సంఘం సభ్యులు గుడి వద్దకు వెళ్లి షెడ్డు నిర్మిస్తుండగా వెలమసంఘం సభ్యులపై నాగేశ్వరరావుతో పాటు రేలంగి రమణ రాళ్ల దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో బోదంకి సత్యనారాయణ తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందగా మరో ఏడుగురు గాయాలపాలయ్యారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దాడి కేసులో నిందితుడిగా ఉన్న నాగేశ్వరరావు, రమణను మండపేట బైపాస్ రోడ్డులో అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్టు సీఐ తెలిపారు. కేసులో నిందితులను త్వరితగతిన అరెస్టు చేసిన ఎస్ఐ సురేష్ బాబు, సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.

రాయవరంలో ఎస్పీ పరిశీలన

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేదిలేదని కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా అన్నారు. రాయవరంలో రాళ్ల దాడి జరిగిన ప్రాంతాన్ని మంగళవారం సాయంత్రం ఆయన పరిశీలించారు. దాడి ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. తొలుతగా పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను ఎస్పీ పరిశీలించారు. ఆయన వెంట సీఐ పి.దొరరాజు, ఎస్ఐ డి.సురేష్‌బాబు ఉన్నారు.

ప్రైవేటు బస్సు ఢీకొని వ్యక్తి మృతి


వీరన్న (ఫైల్)

జగ్గంపేట రూరల్, సెప్టెంబరు 30 (ఆంధ్ర జ్యోతి): కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం జె.కొత్తూరు గ్రామ శివారున సోమవారం రాత్రి ప్రైవేటు బస్సు ఢీకొన్న ఘటనలో జె.కొత్తూరుకి చెందిన ఉంగరాల వీరన్న (50) అక్కడికక్కడే మృతి చెందాడు. వీరన్న జె.కొత్తూరు శివారున కోళ్ల ఫారంలో పనిచేస్తూ ఉంటాడు. ప్రతిరోజులానే కోళ్ల ఫారంలో నిద్రించేందుకు ఇంటి నుంచి నడుచుకుంటూ బయలుదేరాడు. రోడ్డు పక్కగా నడుచుకుంటూ వెళ్తున్న అతడిని నెక్కంటి రొయ్యల పరిశ్రమకు చెందిన ప్రైవేటు బస్సు ఢీకొని తల మీద నుంచి వెళ్లడంతో తల భాగం నుజ్జునుజ్జయి మృతి చెందాడు. వీరన్నకు భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు. విషయం తెలిసి కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకుని విలపించారు. కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ టి.రఘునాథరావు తెలిపారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి


షేక్ నాగూర్ మీరా(ఫైల్)

పి.గన్నవరం, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తిని లారీ రూపంలో మృత్యువు కబలిం చింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరంలోని ఏనుగుపల్లి ఏటిగట్టు సెంటర్ కల్వర్టు వద్ద రాజోలు వైపు నుంచి వస్తున్న సిమెంట్ లారీ వెనుక నుంచి బలంగా ఢీకొని షేక్ నాగూర్‌మీరా(45) అక్కడికక్కడే మృతి చెందా డు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లా నేరేడుచర్ల మండలం బక్కాయిగుడెం శివారు మేడారం గ్రామానికి చెందిన షేక్ నాగూర్‌మీరా కొన్నాళ్లుగా పి.గన్నవరం శివారు డీఎస్‌పాలెంలో నివాసం ఉంటున్నాడు. సమీప షాపుల్లో, ఇంటింటికి తిరిగి సాంబ్రాణి పొగ వేసి దిష్టి నిమ్మకాయలు కట్టి జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం సైకిల్‌పై వెళ్లి పి.గన్నవరం సెంటర్‌లో దుకాణాలకు సాంబ్రాణి పొగవేసి నిమ్మకాయలు కట్టాడు. అనంతరం పి.గన్నవరంలోని కె.ఏనుగుపల్లి ఏటిగట్టు సెంటర్ నుంచి త్రీరోడ్డు సెంటర్ వైపు సైకిల్‌పై వస్తున్న సమయంలో రాజోలు వైపు నుంచి వస్తున్న సిమెంట్ లారీ వెనుక నుంచి బలంగా ఢీకొంది. దీంతో నాగూర్‌మీరా తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. అతడికి భార్య జిభాషా ఉన్నారు. మీరా బంధువు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బి.శివకృష్ణ తెలిపారు. కాగా మలికిపురంలో సిమెంట్ లోడు దించి లారీ తిరిగి వస్తుండగా ఈ ఘటన జరిగిందని పోలీసులు తెలిపారు.

యువకుడిపై కర్రతో దాడి


శ్రీహరి తలకు తీవ్రగాయం

ఎటపాక, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): యువకుడిపై మరో యువకుడు కర్రతో దాడి చేయడంతో తలకు తీవ్రగాయమైంది. ఈ ఘటన అల్లూరి జిల్లా ఎటపాక మండలం నెల్లిపాక గ్రామంలో సోమవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లిపాక గ్రామానికి చెందిన దుద్దుకూరి శ్రీహరి సోమవారం రాత్రి బతుకమ్మల నిమ జ్జనం కార్యక్రమంలో పాల్గొన్నాడు. ఇంతలో బైక్‌లు రహదారిపై తనకోసమే అడ్డంగా పెట్టారని ఇదే గ్రామానికి చెందిన ముది గొండ వినయ్ అనే యువకుడు శ్రీహరితో వాగ్వాదానికి దిగాడు. విషయం తెలుసుకున్న వినయ్ కుటుంబ సభ్యులు అక్కడికి వచ్చి శ్రీహరితో మాట్లాడుతున్న క్రమంలో వినయ్ ఆవేశంతో వెనుక నుంచి దాబా హోటల్‌లోని కట్టె పొయ్యితో శ్రీహరి తలపై కొట్టాడు. దీంతో తలపై గాయమై రక్తస్రావం జరిగింది. పోలీసులు వినయ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దుర్గమ్మకు ప్రత్యేక పూజలు

మోతుగూడెం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా మోతుగూడెం శ్రీలక్ష్మీ గణపతి దేవాలయంలో కనకదుర్గమ్మ అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ వ్యవస్థాపకులు పెద్ద కుమారుడు శ్రీను, కుమార్తె భవాని పద్మజ ఆధ్వర్యంలో దుర్గమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వస్త్రాలు, ఆభరణాలు బహూకరించారు. అర్చకస్వామి పవన్‌కుమార్ శర్మ హోమం నిర్వహించారు. మాదేశి శ్రీను దంపతులు అన్న సమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.


హోమం నిర్వహిస్తున్న దృశ్యం

దుర్గాదేవిగా దర్శనం


అన్నవరంలో దుర్గాదేవిగా దర్శనమిస్తున్న వనదుర్గమ్మ

అన్నవరం, సెప్టెంబరు 30 (ఆంధ్ర జ్యోతి): దుర్గాష్టమి పర్వదినం పురస్కరించుకుని రత్నగిరి క్షేత్రరక్షకిలు అయిన వనదుర్గ, కనకదుర్గలు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. దుష్టశిక్షణ శిష్టరక్షణగా అవతరించిన మాతగా అనుగ్రహించారు.

లోవలో...


లోవలో దుర్గాదేవిగా దర్శనమిస్తున్న తలుపులమ్మ

తుని రూరల్, సెప్టెంబరు 30 (ఆంధ్ర జ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం తలుపులమ్మ లోవ దేవస్థానంలో అమ్మవారు దుర్గాష్టమి పర్వదినం పురస్కరించుకుని మంగళవారం శ్రీ దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. ఆలయ అధికారులు తీర్థప్రసాదాలందజేశారు.

తోటపల్లిలో...

ఎటపాక, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాల్లో భాగంగా ఎటపాక మండలం తోటపల్లి గ్రామంలో అమ్మవారిని జైమాత యూత్ ఆధ్వర్యంలో దుర్గాదేవీగా అలంకరించారు. ఎటపాక సీఐ కన్నపరాజు, ఎస్ఐ అప్పలరాజు అమ్మవారిని దర్శించుకున్నారు. గ్రామపెద్దలు కడియాల వెంకటేశ్వరరావు, వల్లభనేని చందు, రాకేష్ ఉన్నారు.

కమనీయం
కరప దసరా సంబరం



మెరక వీధి రామాలయం వద్ద ఏనుగు ప్రతిమ, బుట్టబొమ్మలను సిద్ధం చేసిన దృశ్యం

దసరా పండగ అంటే ప్రజలకు ఠక్కున గుర్తొచ్చే ఊరు కరప. అంతటి ప్రత్యేకత సంతరించుకున్న కరప దసరా సంబరానికి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లావ్యాప్తంగా మంచి గుర్తింపు ఉంది. కనుల నిండుగా కమనీయ దృశ్యాలతో జరిగే కరప దసరా ఉత్సవం వెనుక చారిత్రాత్మక నేపథ్యం, గ్రామ పూర్వీకుల కృషి ఎంతో ఉంది. దసరా వచ్చిందంటే చాలు ఎక్కడెక్కడో ఉన్న గ్రామస్తులు, బంధువులు రెక్కలు కట్టుకుని ఇక్కడ వాలిపోతారు. ఇక్కడి ప్రజల్లో ఐక్యతను తీసుకొచ్చే ఏకైక పండగ దసరా అంటే ఏమాత్రం అతిశయోక్తి కాదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎంతో పేర్గాంచిన కరప దసరా సంబరం కోసం అందరూ ఆత్రంగా ఎదురు చూస్తుంటారు. అంతటి ఘన కీర్తి, చారిత్రక నేపథ్యం కలిగిన కరప దసరా సంబరాన్ని ఈ ఏడాది కూడా అంగరంగ వైభవంగా నిర్వహించడానికి గ్రామస్తులు సిద్ధమయ్యారు. ఆయా ఆలయ కమిటీల ఆధ్వర్యంలో అందుకు అవసరమైన ఏర్పాట్లు చకచకా జరిగిపోతున్నాయి. గురువారం జరగనున్న దసరా ఉత్సవాన్ని కనులారా వీక్షించి జ్ఞాపకాలను పదిలపర్చుకోవడానికి గ్రామస్తులు, బంధువులు ఉవ్విళ్లూరుతున్నారు.

కరప, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రులను పురస్కరించుకుని కరప గ్రామంలోని అన్ని వీధుల్లో రామాలయాలు పండగ శోభ సంతరించుకున్నాయి. ఆలయ కమిటీల నిర్వాహకులు ఏనుగు, హంస ప్రతిమలను బయటకుతీసి వాటిని సర్వాంగసుందరంగా ముస్తాబు చేస్తున్నారు. ఈ ప్రతిమలకు రంగురంగుల కాగితాలు, విద్యుత్ సొబగులు అద్దుతున్నారు. ఈ ప్రతిమలను గ్రామంలో ఊరేగించేందుకు ట్రాలీలు, ట్రాక్టర్లను సిద్ధం చేస్తున్నారు. వాటి ముందు ప్రదర్శనకు ఉంచే బ్యాండు మేళాలు, తీన్‌మార్ డప్పులు, పలు రకాల సజ్జల పురమాయింపులు పూర్తి చేశారు. భారీ జన సందోహం నడుమ తెల్లవార్లు జరిగే ఈ ఉత్సవంలో ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు చర్యలు తీసుకుంటున్నారు. ఈ ఉత్సవంలో సాంస్కృతిక ప్రదర్శనలకు ఒక ప్రత్యేకత ఉంది. ఊరేగింపునకు బయల్దేరే ఏనుగు, హంస ప్రతిమల ముందు, వెనుక బ్యాండు మేళాలు, తప్పెటగుళ్ల, కోలాటం, లక్కగుర్రాలు, బుట్టబొమ్మలు, కోయ డాన్సులు, కర్రసాము, పులి, వెలుగుబంటి వేషాలు చూపరులను ఆకర్షిస్తాయి.దశమి రోజున అమ్మవారికి బాణసంచా కాల్పుల నడుమ పల్లకిలో గ్రామోత్సవం నిర్వహిస్తారు.ఇలా చేయడం వల్ల గ్రామం సుభిక్షంగా ఉంటుందని, పాడి పంటలతో అలరారుతుందని ప్రజలు విశ్వసిస్తారు. రంగురంగుల విద్యుత్ అలంకరణలతో బారులు తీరే ఏనుగు, హంస వాహనాలు గ్రామంలో తెల్లవార్లు తిరిగిన తర్వాత ఒకచోట ఉంచి జమ్మిపత్రితో పూజ నిర్వహిస్తారు. ఏటా కన్నుల పండువగా జరిగే ఈ దసరా ఉత్సవాన్ని రక్తి కట్టించాలని కమిటీ సభ్యులు, స్థానికులు శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారు.



గతంలో వీధివీధికి తిరుగుతూ రామాయణంలోని ముఖ్య ఘట్టాలను ఇలా ప్రదర్శించేవారు

ఇదీ నేపథ్యం:

మైసూర్‌లో దసరా ఉత్సవాన్ని వీక్షించిన గ్రామ పూర్వీకులు కరపలో కూడా ఇటువంటి ఉత్సవాన్ని ప్రతిఏటా నిర్వహించాలని నిశ్చయించారు. మైసూర్‌లో నిజ ఏనుగులతో సంబరం నిర్వహిస్తారు. ఇక్కడ చెక్క, గోనెసంచులు, తెల్లటి వస్త్రాలు, ఇతర ముడిసరుకుతో తయారుచేసిన ఏనుగు ప్రతిమతో చేయడం ప్రారంభించారు. కాలక్రమేణా గ్రామంలోని అన్ని వీధుల నుంచి ఈ సంప్రదాయం మొదలైంది. పల్లపు వీధి, మెరక వీధి, కొత్తపేట, నీలయ్య తోట నుంచి ఏనుగులు, సీతమ్మపేట, రామ దాసు గుడి, బీసీ పేట, ఎస్సీ పేట నుంచి హంస ప్రతిమలు సంబరంలో పాల్గొంటాయి. అనంతర కాలంలో పంచాయతీ వీధి పెద్దలు హంస ప్రతిమను రూపొందించి సంబరంలో భాగస్వాములయ్యారు. ఈ ప్రతిమలకు రంగురంగుల విద్యుత్ అలంకరణలు చేసి ప్రత్యేక వాహనాలపై రాత్రి తెల్లవార్లు వీధుల్లో ఊరేగిస్తారు. ఈ ఏనుగు, హంస బొమ్మల వెంట పలు సాంస్కృతిక ప్రదర్శనలు, వివిధ రకాల సజ్జలు బయల్దేరుతాయి. పల్లపు వీధి వాసులు తొలిగా ఏనుగు సంబరాన్ని నిర్వహించారు. ఈ దసరా సంబరం నిర్వహణకు చందాల వసూలుతో పాటు ధాన్యం కొలగారం సొమ్మును వినియోగిస్తారు. జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చి సంబరాన్ని వీక్షించడం పరిపాటి. తొలినాళ్లలో పల్లపు వీధికి చెందిన పలువురు కళాకారులు రామాయణం లోని పాత్రలను కళారూపంలో ప్రదర్శించేవారు. రామాయణ ఇతిహాసంలోని ముఖ్య ఘట్టాలను తీసుకుని రోజుకో ఘట్టాన్ని పద్య రూపంలో హృద్యంగా పాడుతూ అన్ని వీధులూ కలియదిరిగేవారు. కాలక్రమేణా కళాకారులు కరువవడంతో ఆ ప్రదర్శనలకు ముగింపు పలకాల్సి వచ్చిందని పెద్దలు చెప్తున్నారు.



విద్యుత్ కాంతుల నడుమ ఊరేగుతున్న ఏనుగు ప్రతిమలను వీక్షిస్తున్న జనం (పాత చిత్రం)





మహాశక్తి యాగంలో సామూహిక కుంకుమార్చన చేస్తున్న మహిళలు, బగళాముఖి అమ్మవారికి హారతి ఇస్తున్న స్వామి పరిపూర్ణానంద సరస్వతి

శ్రీపీఠం... జన సంద్రం

- మహాశక్తి యాగానికి దుర్గాష్టమి రోజున పోటెత్తిన భక్తులు
- వంద కోట్లు దాటిన లలితా సహస్రనామ కుంకుమార్చన

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కాకినాడలోని శ్రీపీఠం గోశాల ప్రాంగణం మంగళవారం భక్తజనసంద్రమైంది. దుర్గాష్టమి కావడంతో మహాశక్తి యాగంలో పాల్గొనేందుకు భక్తులు వేలాదిగా తరలివచ్చారు. 9వ రోజున ఐశ్వర్యాంబిక అమ్మవారికి బగళాముఖిగా విశేష అలంకరణ చేసి వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ దేవీ కవచం, బగళాముఖి హోమం నిర్వహించారు. సామూహికంగా లలితా సహస్రనామ కుంకుమార్చనలు చేశారు. భక్తులకు స్వామి పరిపూర్ణానంద అనుగ్రహ భాషణ చేస్తూ.... మంగళాష్టమి జయ అష్టమి అని, ఈ రోజు అమ్మవారిని ఆరాధించే ప్రసిద్ధమైన రోజన్నారు. రెండు, మూడు క్షేత్రాలు దర్శించినా ఇంత స్ఫూర్తిరూపమైన బగళాముఖి రూపాన్ని దేశంలో ఎక్కడా చూడలేదన్నారు. పుట్టుకతోనే స్త్రీలకు అమ్మవారి అనుగ్రహం పొందగలిగే శక్తి వచ్చేస్తోందన్నారు. అమ్మ అనుగ్రహానికి పాత్రులయ్యేందుకు లలితా సహస్రనామమే ఒక సాధనమన్నారు. వెయ్యి కోట్ల లలితా సహస్ర కుంకుమార్చనతో చేపట్టిన యాగం 9వ రోజుకే వంద కోట్లకు పైగా పూర్తి చేసుకుందన్నారు.

హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ నాట్యాచారిణి జ్యోతి మాట్లాడుతూ వేలాది మంది మహిళామూర్తులతో లలితా సహస్ర నామ కుంకుమ పూజలు చేయడం, పారాయణ నిర్వహించడం దేశంలో ఎక్కడా చూడలేదన్నారు. ఇంట్లో నిత్యం లలితాసహస్రం పారాయణ చేస్తానని, దాంతో అంతా మంచే జరుగుతోందన్నారు. ఎంతో అదృష్టం ఉంటే తప్ప ఇంత గొప్ప యాగంలో భాగస్వాములు కాలేమన్నారు. సుమారు 50వేల మంది భక్తులు హాజరైనట్టు నిర్వాహకులు తెలిపారు. సర్పవరం సీఐ బి.పెద్దిరాజు ఆధ్వర్యంలో సిబ్బంది, కాకినాడ ట్రాఫిక్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



లలితా సహస్ర నామ విశిష్టతను తెలియజెప్తున్న ప్రముఖ నాట్యాచారిణి జ్యోతి

ఒళ్లు గగుర్పొడిచేలా..

- శరీరానికి శూలాల గుచ్చుకుని.. క్రేన్‌కు వేలాడుతూ..
- బర్మాకాలనీలో శూలాల పండుగ

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): శరీరానికి శూలాలు గుచ్చుకుని.. వాటికి తాళ్లు కట్టి, ఆ తాళ్లను క్రేన్‌కు కట్టి, ఇలా ఇద్దరు మనుషులు క్రేన్‌కు వేలాడుతుంటే.. రాజమండ్రి వీధుల్లో క్రేన్ కదులుతుంటే.. వారిని చూసే వారి ఒళ్లు గగుర్పాటుకు గురైంది. బర్మా కాలనీ ప్రజలు మాత్రం భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. ఇది రాజమహేంద్రవరంలో మంగళవారం జరిగిన ఓ ప్రదర్శన. గెయిల్ ఎదురుగా ఉన్న కనకదుర్గమ్మ గుడి నుంచి ఈ ఊరేగింపు విద్యుత్ కాలనీ, వేంకటేశ్వరానగర్ తదితర ప్రాంతాల్లో సాగింది. దసరా సందర్భంగా బర్మా కాలనీ వాసులు తమ ఇష్టదైవమైన సుబ్రహ్మణ్యేశ్వరుడిని పూజిస్తూ ఇలా చేస్తుంటారు. గతంతో గొంతులోనూ, నాలుకకు, వీపు మీద శూలాలు గుచ్చుకునే వారు. ఇవాళ క్రేన్‌కు వేలాడుతూ స్వామి వారి పట్ల తమ భక్తిని చాటుకున్నారు.







శరీరానికి శూలాలు గుచ్చుకుని వాటికి తాళ్లు కట్టుకుని క్రేన్‌కు వేలాడుతున్న భక్తులు



ఊరేగింపులో పాల్గొన్న బర్మా కాలనీ వాసులు

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

విడాకులు ఇచ్చేశారు



ప్రముఖ తమిళ సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్‌కుమార్, ఆయన సతీమణి, నేపథ్యగాయని సైంధవి చట్టబద్ధంగా విడిపోయారు. వీరికి చెన్నై ఫ్యామిలీ కోర్టు మంగళవారం విడాకులు మంజూరు చేసింది. 2013లో వివాహం చేసుకున్న వీరికి అన్వీ అనే కుమార్తె ఉంది. మనస్పర్థల కారణంగా గత యేడాది విడిపోతున్నట్టు ప్రకటించి, విడాకుల కోసం కోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో చివరగా ఈ నెల 25వ తేదీన విచారణ జరగ్గా, జీవీ ప్రకాశ్, సైంధవి కోర్టుకు హాజరై విడిపోయేందుకు సమ్మతం తెలిపారు. అదే సమయంలో తన కుమార్తె సంరక్షణ బాధ్యతలను సైంధవి స్వీకరించడానికి తనకెలాంటి అభ్యంతరం లేదని జీవీ ప్రకాశ్ న్యాయమూర్తికి తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ కేసు తుది తీర్పును మంగళవారం కోర్టు వెలువరించింది. జీవీ ప్రకాశ్ - సైంధవి దంపతులకు విడాకులు మంజూరు చేస్తూ, కుమార్తె సంరక్షణా బాధ్యతలను సైంధవికి అప్పగిస్తున్నట్లు ప్రకటించింది.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

కౌబాయ్‌గా మళ్లీ వస్తున్న మెగాస్టార్



మెగాస్టార్ చిరంజీవి నటించిన ఏకైక కౌబాయ్ చిత్రం 'కొదమసింహం'. చిరంజీవి, శ్రీదేవి జంటగా నటించిన సూపర్ హిట్ చిత్రం 'జగదేకవీరుడు-అతిలోకసుందరి' విడుదలైన సరిగ్గా మూడు నెలలకు అంటే 1990 ఆగస్టు 9న కొదమసింహం విడుదలైంది. ఆ సమయంలో వస్తున్న చిత్రాలకు భిన్నంగా ఉండడంతో ప్రేక్షకులు ఈ సినిమాను బాగా ఆదరించారు. కైకాల సత్యనారాయణ సమర్పణలో ఆయన సోదరుడు నాగేశ్వరరావు నిర్మించిన 'కొదమసింహం' చిత్రానికి మురళీమోహనరావు దర్శకుడు. ఈ సినిమాలో చిరంజీవి సరసన రాధ, సోనమ్, వాణీవిశ్వనాథ్ నటించారు. మోహన్‌బాబు పోషించిన కామెడీ విలన్ పాత్ర 'సుడిగాలి' ఈ చిత్రానికి మరో ఆకర్షణ. 'కొదమసింహం' చిత్రాన్ని 4కెలోకి మార్చి, 5.1 డిజిటల్ సౌండింగ్ వంటి అదనపు హంగులు చేకూర్చి నవంబర్ 21న మళ్లీ విడుదల చేయనున్నారు. విజయదశమి సందర్భంగా చిత్ర నిర్మాత నాగేశ్వరరావు ఈ విషయాన్ని వెల్లడించారు. సంగీత దర్శకత్వ ద్వయం రాజ్-కోటి స్వరపరిచిన పాటలు ఈ చిత్రానికి మరో హైలైట్.

శుక్రాచార్యుడిగా అక్షయ్ ఖన్నా



ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ నుంచి వచ్చిన తొలి పాన్ ఇండియా చిత్రం 'హనుమాన్' బ్లాక్ బస్టర్ హిట్ కొట్టిన విషయం తెలిసిందే. దీనికి సీక్వెల్‌గా 'జై హనుమాన్' రూపుదిద్దుకుంటోంది. ఈ యూనివర్స్‌లో వస్తోన్న మూడో ప్రాజెక్టు 'మహాకాళి'. దీనికి ప్రశాంత్ వర్మ కథను సమకూర్చగా, పూజ అపర్ణ కొల్లూరు తెరకెక్కిస్తున్నారు. ఆర్కేడీ స్టూడియోస్ బేనర్‌పై రివాజ్ రమేశ్ దుగ్గల్ నిర్మిస్తున్నారు. హిందీ చిత్రం 'ఛావా'లో ఔరంగజేబు పాత్రను అద్భుతంగా పోషించిన అక్షయ్ ఖన్నా 'మహాకాళి'లో అసురుల గురువు శుక్రాచార్యుడిగా కనిపించనున్నారు. ఇది ఆయనకు తెలుగులో తొలి చిత్రం. తాజాగా అక్షయ్ పాత్రను పరిచయం చేస్తూ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఒక భారీ కోట ముందు నిలబడి ఉన్నట్లు ప్రజెంట్ చేసిన తీరు ఆకట్టుకుంటోంది. కాగా, ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇప్పటికే 50 శాతం చిత్రీకరణ పూర్తయినట్లు చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సురేశ్ రగుతు, సంగీతం: స్మరణ్ సాయి.

ఉత్కంఠకు గురిచేసే ఆర్యన్



విష్ణు విశాల్, శ్రద్ధా శ్రీనాథ్ జంటగా ప్రవీణ్ కె తెరకెక్కించిన పరిశోధనాత్మక ఉత్కంఠ భరిత చిత్రం 'ఆర్యన్'. శుభ్ర, ఆర్యన్ రమేశ్, విష్ణు విశాల్ నిర్మాతలు. ఈనెల 31న తమిళం, తెలుగు భాషల్లో విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ టీజర్‌ని విడుదల చేశారు. ఓ హత్య కేసును దర్యాప్తు చేస్తోన్న విష్ణు విశాల్ పాత్రను టీజర్‌లో ఆసక్తికరంగా పరిచయం చేశారు. తనదైన శైలిలో, విభిన్నమైన నటనతో విశాల్ ఆకట్టుకున్నారు. 'రాట్ససన్' విజయం తర్వాత విష్ణు విశాల్ మరోసారి 'ఆర్యన్'లో పోలీస్ అధికారి పాత్రను పోషిస్తున్నారు.

సవాళ్లకు సిద్ధమే



సవాళ్లకు తానెప్పుడూ సిద్ధమే అంటున్నారు బాలీవుడ్ అగ్ర కథానాయిక దీపికా పదుకొనే. ఐఎండీబీ తాజాగా పాతికేళ్ల భారతీయ సినిమా (2000-2025) జాబితాను విడుదల చేసింది. అందులో అత్యంత ప్రజాదరణ పొందిన నటీనటుల్లో దీపికా పదుకొనే నాలుగో స్థానంలో నిలిచారు. ఈ జాబితాలో స్థానం దక్కడంపై దీపిక మాట్లాడుతూ 'కెరీర్ ఆరంభం నుంచే సినీరంగంలో మహిళలు ఎలా నడుచుకోవాలో తరచూ నాకు చెప్పేవారు, అయితే అలాంటి మూస ధోరణిని సవాల్ చేయాలని నేను అప్పుడే నిర్ణయించుకున్నాను. ఏదైనా నచ్చకపోతే వెంటనే ప్రశ్నించేదాన్ని. మహిళలు అణిగిమణిగి ఉండాలన్నట్లు ప్రవర్తించే ధోరణిని ఎదుర్కోవడం వల్ల ఇబ్బందులు పడాల్సి వస్తుందని నాకు తెలుసు. అయినా నేను వెనుకాడలేదు. నా కుటుంబం, అభిమానులు, సహచరులు నాకు అండగా నిలిచారు. ఎన్ని ఒత్తిళ్లు ఎదురైనా నాకు నచ్చినట్లు ఉండగలిగే శక్తిని, ధైర్యాన్నిచ్చారు. చివరకు నా నమ్మకం నిజమైంది. నా తర్వాతి తరం కథానాయికలకు ఒక కొత్తదారిని వేయగలిగాననే సంతృప్తి నాకు ఉంది' అని చెప్పారు. ప్రభాస్ కథానాయకుడిగా సందీప్ రెడ్డి వంగా దర్శకత్వం వహిస్తున్న 'స్పిరిట్' చిత్రం నుంచీ, అలాగే నాగ్ అశ్విన్ 'కల్కి 2898 ఏడీ' సీక్వెల్ నుంచి ఆమె వైదొలగారు. 8 గంటల పని నిబంధనకు మేకర్స్ అంగీకరించకపోవడంతో ఆమె ఆ సినిమాల నుంచి వైదొలగారనే ప్రచారం జరిగింది. ఆ సమయంలో చెలరేగిన వివాదంపై దీపిక ఇలా పరోక్షంగా స్పందించారని బాలీవుడ్ విశ్లేషకులు అంటున్నారు.

రెండొందల కథలు విని.. ఓకే చేశారు



కన్నడ చిత్ర కథానాయకుడు శ్రీమురళి కొత్త చిత్రం 'పరాక్' మంగళవారం బెంగళూరులో మొదలైంది. అక్కడి బండి మహాకాళి ఆలయంలో జరిగిన పూజా కార్యక్రమంలో చన్నగిరి శాసన సభ్యుడు శివగంగ బసవరాజు తొలి క్లాప్ ఇచ్చి షూటింగ్‌కు శ్రీకారం చుట్టారు. హలేశ్ కోగుండి ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. 'ఇది ఒక వింటేజ్ స్టైల్ సినిమా. దాదాపు రెండొందల కథలు విని ఈ కథ ఓకే చేశాను. రెగ్యులర్ షూటింగ్ ఈ నెలలోనే ప్రారంభమవుతుంది' అని శ్రీమురళి చెప్పారు. బ్రాండ్ స్టూడియోస్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రానికి చరణ్‌రాజ్ సంగీత దర్శకుడు.

జాంబీ నేపథ్యంలో రణ్‌వీర్ చిత్రం



బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ సింగ్ జాంబీ నేపథ్యంలో కొత్త సినిమా చేయబోతున్నారు. ఈ చిత్రానికి జై మెహతా దర్శకత్వం వహించనున్నారు. అప్లాజ్ ఎంటర్‌టైన్‌మెంట్ బేనర్‌పై రూపుదిద్దుకోనున్న ఈ చిత్రానికి 'ప్రళయ్' అనేది వర్కింగ్ టైటిల్. రణ్‌వీర్ సింగ్ ప్రస్తుతం 'డాన్-3' షూటింగ్‌తో బిజీగా ఉన్నారు. ఇది పూర్తవడానికి మరో ఆరు నెలలు పడుతుంది. వచ్చే ఏడాది ద్వితీయార్థంలో ఈ ప్రాజెక్టు పట్టాలెక్కనుందని, ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జోరుగా సాగుతున్నాయని బాలీవుడ్ మీడియా కథనం. మరో వైపు రణ్‌వీర్ సింగ్ సరసన నటించబోయే స్టార్ కథానాయిక కోసం చిత్రబృందం అన్వేషిస్తోంది.







దుర్గాదేవికి హారతి

ఘనంగా దుర్గాష్టమి

కిక్కిరిసిన దేవీచౌక్

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం దేవీచౌక్‌లో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం దుర్గాష్టమి సందర్భంగా వేలాదిమంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి కుంకుమ పూజలు, ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. దుర్గాష్టమి కావడంతో కనక దుర్గ అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. భారీ సెట్టింగ్‌లు, మిరుమిట్లు గొలిపే విద్యుత్ దీపాలను తిలకించేందుకు నగరంతోపాటు ఇతర ప్రాంతాల జనం భారీగా తరలివచ్చారు.





విద్యుత్ వెలుగుల్లో రాజమహేంద్రి దేవీచౌక్ (డ్రోన్ చిత్రం).. మంగళవారం రాత్రి భక్తుల సందడి

వర్షాభావం



లోటు.. కలవరం!

- ముగిసిన నైరుతి రుతుపవనాల సీజన్.. సీజనంతా లోటు వర్షపాతమే
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అధిక వర్షపాతానికి బదులు అంతా కొరతే
- కాకినాడ జిల్లాలో 21 మండలాలకుగాను 16మండలాల్లో లోటు వర్షపాతం
- కోనసీమలోని 22 మండలాలూ లోటుతో రెడ్‌మార్క్‌లో చేరిన వైనం
- తూర్పుగోదావరిలో 19 మండలాలకు తాళ్లపూడి మినహా అన్నీ కొరతే
- అల్లూరి జిల్లా పరిధిలోని ఏజెన్సీ మండలాల్లోనూ కొంత ఇదే పరిస్థితి

(కాకినాడ - ఆంధ్రజ్యోతి)

ఈ ఏడాది వర్షాకాలం సీజన్ నిరాశే మిగిల్చింది. నైరుతి పవనాలు ఊరించి ఊరించి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాను ఉసూరుమనిపించాయి. మంగళవారంతో ముగిసిన నాలుగు నెలల రుతుపవనాల సీజన్ ఉమ్మడి జిల్లాను లోటు వర్షపాతంలోకి నెట్టింది. కావలసిన సాధారణ వర్షపాతం కంటే తక్కువ వర్షపాతంలో రెడ్‌మార్క్‌లోకి చేరింది. కాకినాడ, తూ.గో. కోనసీమ జిల్లాల్లో కలిపి 62 మండలాలకుగాను 57 మండలాలు, అటు అల్లూరి ఏజెన్సీ ప్రాంతంలోని 11 మండలాలకుగాను 5 మండలాల్లో అత్యధిక వర్షపాతం, మిగిలిన 6 మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది. గతేడాది రుతుపవనాల సీజన్‌లో ఉమ్మడి జిల్లాలో భారీ వర్షాలతో అదనపు వర్షపాతం జాబితాలో చేరగా, ఈ సీజన్‌లో మాత్రం లోటులో చేరింది.

ఊరించి.. ఉసూరుమనిపించి...

ఏటా రుతుపవనాల సీజన్ జూన్ నుంచి సెప్టెంబరు వరకు కొనసాగుతుంది. నాలుగు నెలల వ్యవధిలో కురిసే భారీ వర్షాలే వ్యవసాయ రంగానికి, భూగర్భజలాలకు కీలకం. అయితే ఈసారి నైరుతి రుతుపవనాలు ఉమ్మడిజిల్లాను ఈసురోమనిపించింది. ఏటా ఈ సీజన్‌లో భారీ వర్షాలు కురుస్తాయన్న అంచనాలను తల్లకిందులు చేసింది. తొలి రెండు నెలలైన జూన్, జూలైలో వాన జాడే కనిపించకపోవడంతో అంతా ఆగస్టు, సెప్టెంబరులో కురిసే భారీ వర్షాలతో అయినా లోటు తీరుతుందని భావించారు. తీరా మంగళవారంతో ముగిసిన నాలుగు నెలల సీజన్ పరిశీలిస్తే పూర్తిగా లోటు వర్షపాతమే మిగిలింది. కురవాల్సిన సాధారణ వర్షపాతం కాదు కదా అంతకంటే తక్కువగా నమోదైంది. దీంతో ఈఏడాది వర్షాకాలం సీజన్ తక్కువ వర్షాలతో ముగిసినట్టయింది. వాస్తవానికి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో నాలుగు నెలలకు కలిపి సాధారణ వర్షపాతం 2,235మి.మి. నమోదవాల్సి ఉంటే కేవలం 1673మి.మి. నమోదైంది. కాకినాడ జిల్లాలో నాలుగు నెలల సీజన్‌కు కలిపి 670.1మి.మి. వర్షపాతం కురవాల్సి ఉంటే కేవలం 533.8.మి.మి. నమోదైంది. దీంతో జిల్లా లోటు వర్షపాతం జాబితాలో రెడ్ మార్క్‌లో చేరింది. ఈ జిల్లాలో నాలుగు నెలలకు కలిపి సరాసరి వర్షం కురిసిన రోజులు కేవలం 36 మాత్రమే. దీంతో సెప్టెంబరు 30నాటికి నాలుగు నెలల వ్యవధిలో కావలసిన వర్షపాతం కంటే మైనస్ 20.34% లోటు కనిపిస్తోంది. కోనసీమ జిల్లాలో ఈ సీజన్‌లో 779 మి.మి. వర్షపాతానికిగాను కేవలం 539.2మి.మి. నమోదైంది. 30.78% లోటు తేలి డెఫిసిటీ కేటగిరీలో జిల్లా చేరింది. నాలుగు నెలలకు కలిపి ఈ జిల్లాలో వర్షం కురిసిన సరాసరి రోజులు కేవలం 35. తూ.గో.జిల్లాలో ఈ సీజన్‌లో 775.9మి.మి. వర్షపాతం నమోదవాల్సి ఉంటే కేవలం 600.1 నమోదైంది. 22.66% లోటు వర్షపాతంలో జిల్లా రెడ్‌మార్క్‌లో చేరింది. ఈ జిల్లాలో సీజన్‌లో వర్షం కురిసిన రోజులు 43గా నమోదైంది. వాస్తవానికి గత నెల వరకు కాకినాడ జిల్లా ఒక్కటే సాధారణ వర్షపాతంతో గ్రీన్ జాబితాలో ఉండగా, సెప్టెంబరులోను తగినంత వాన లేకపోవడంతో రెడ్‌లోకి చేరింది. ఒకరకంగా చెప్పాలంటే జూన్, జూలైలో వర్షపాతం తక్కువ నమోదైందనుకుంటే అంతకుమించిన లోటు సెప్టెంబరులో తేలింది. కాకినాడ జిల్లాలో జూలైలో సరాసరి వర్షపాతం 202.84 మి.మి. నమోదవాల్సి ఉంటే కేవలం 113.58 మి.మి. నమోదైంది. ఆగస్టులో 183.1 మి.మి.కు 127.31 నమోదైంది. సెప్టెంబరులో అయితే అత్యంత తీసికట్టుగా మారింది. ఈ నెలలో జిల్లాలో 181.33మి.మి. వాన కురవాల్సి ఉంటే కేవలం 59.62 మి.మి. కురిసింది. కోనసీమ జిల్లాలో జూలైలో 242.69మి.మి.కు 97.24మి.మి., ఆగస్టులో 232.1మి.మి.కు 122.25మి.మి., సెప్టెంబరులో 201.81కు 79.03మి.మి. మాత్రమే వర్షం కురిసింది. తూ.గో.లో జూలైలో 246.94మి.మి.కు 117.72, ఆగస్టులో 237.02 మి.మి.కు 82.15, సెప్టెంబరులో 170.95కు కేవలం 64.02మి.మి. నమోదైంది.

ఆ జిల్లాలో అన్నీ రెడ్...

కాకినాడ జిల్లాలో 21 మండలాలకు కేవలం అయిదు మండలాల్లోనే నాలుగు నెలల సరాసరిలో సాధారణ వర్షపాతంతో గ్రీన్ జాబితాలో ఉన్నాయి. మిగిలిన 16 మండలాలు లోటు వర్షపాతంతో రెడ్ కేటగిరీలో ఉన్నాయి. గొల్లప్రోలు 5.56 శాతం, కోటనందూరు 19.98% రౌతులపూడి 16.18%, తొండంగి 1.27%,ఏలేశ్వరం 2.67% అదనపు వర్షపాతం నమోదైంది. మిగిలిన మండలాల్లో లోటు వర్షపాతమే మిగిలింది. తూ.గో. జిల్లాలో మొత్తం 19 మండలాలుండగా ఒక్క తాళ్లపూడి మండలం మినహా మిగిలిన అన్నీ లోటు వర్షపాతంతో రెడ్ కేటగిరీలో చేరాయి. ఇక్కడ నాలుగు నెలల సీజన్‌లో 732.1మి.మి. వర్షం కురవాల్సి ఉంటే 778.1మి.మి. వాన పడింది. కోనసీమ జిల్లాలో 22 మండలాలుండగా, అన్నీ లోటు వర్షపాతంతో అల్లాడుతున్నాయి. ఏ ఒక్క మండలంలో కనీసం అదనం వర్షపాతం మాటే లేదు. అత్యధికంగా రాయవరం మండలంలో మైనస్ 54 శాతం లోటు వర్షపాతం రికార్డు అయింది. ఇక రంపచోడవరం ఏజెన్సీలోని 11 మండలాలకుగాను అడ్డతీగల, గంగవరం, మారేడుమిల్లి, వై రామవరం, ఎటపాకలలో అధిక వర్షపాతం నమోదుకాగా, రంపచోడవరం, రాజవొమ్మంగి, వీఆర్ పురం, చింతూరు, కూనవరం, దేవీపట్నంలలో లోటు నమోదైంది.



చివరిరోజు.. చినుకు

వర్షాకాలం సీజన్ ముగింపు రోజు మంగళవారం ఉమ్మడి జిల్లాలోని పలుచోట్ల వాన చినుకులు పడ్డాయి. కాకినాడ జిల్లాలోని పలుచోట్ల భారీ వర్షం కురవగా, కోనసీమలోని అమలాపురం, పరిసర ప్రాంతాల్లోనూ పెద్ద వర్షమే కురిసింది. తూర్పుగోదావరి జిల్లాలో మాత్రం అక్కడక్కడ చిన్నపాటి వాన పడింది.

గోదా'వరీ'





ధవళేశ్వరం బ్యారేజీ వద్ద వరద ప్రవాహం.. రాజమహేంద్రవరంలో ఘాట్‌లోకి వరద ఉధృతి

వరద ఉధృతి

- ధవళేశ్వరం బ్యారేజీ వద్ద రెండో ప్రమాద హెచ్చరిక దిశగా - లంకల్లోకి వరద

(రాజమహహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

గోదావరి ఉధృతంగా మారింది. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద మళ్లీ మొదటి ప్రమాద హెచ్చరిక జారీచేశారు. రెండో ప్రమాద హెచ్చరిక కూడా జారీ చేసే దిశగా ప్రవాహం సాగుతోంది. మంగళవారం రాత్రి 9 గంటలకు బ్యారేజీ నుంచి అంబేద్కర్ కోనసీమ జిల్లా మీదుగా సముద్రంలోకి 11లక్షల 13వేల 227 క్యూసెక్కుల వరద ప్రవాహం పోతోంది. బ్యారేజీ నీటి మట్టం 12.70 అడుగులకు చేరింది. కిందికి వెళ్లే నీటి ప్రవాహం 13 లక్షల క్యూసెక్కులకు చేరినా, బ్యారేజీ నీటిమట్టం 13.75 అడుగులకు చేరినా రెండో ప్రమాద హెచ్చరిక జారీచేస్తారు. ఇక భద్రాచలం వద్ద సాయంత్రం 5గంటలకు నీటిమట్టం 50 అడుగులకు చేరింది. ఇంకా నెమ్మదిగా పెరుగుతోంది. ఇక్కడ 48 అడుగులకు చేరినపుడు రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. నీటి మట్టం 53 అడుగులకు చేరితే మూడో ప్రమాద హెచ్చరిక జారీ అవుతుంది. ప్రస్తుతం భద్రాచలం నుంచి రాజమహేంద్రవరం అఖండగోదావరిలోకి 12లక్షల 51,999 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోస్ ఉంది. ప్రస్తుతం పోలవరం ఎగువ పాపికొండల ప్రాంతం, పోలవరం దిగువన రాజమండ్రి అఖండ గోదావరి ఉగ్రరూపం దాల్చింది. కాగా రోడ్ కం రైలు బ్రిడ్జి నుంచి సాయంకాలం ఒక మహిళా బస్సులో వచ్చి, గోదావరిలో దూకేసినట్టు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. మూడు రోజుల కిందట పుష్కరఘాట్‌లో ఇద్దరు భవానీ భక్తులు స్నానానికి దిగి కొట్టుకుపోయారు. ఈనేపథ్యంలో గోదావరి ఘాట్లలోకి, గోదావరి స్నానానికి ఎవరినీ అధికారులు అనుమతించడంలేదు. కాగా వరద నీటి ఉధృతికి బ్యారేజీ దిగువన ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని లంక భూముల్లోకి వరద ముంచెత్తింది. లంక గ్రామాల్లోకి రాకపోకలూ బంద్ అయ్యాయి. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు.



నేటి నుంచి రాజమండ్రి టు తిరుపతికి విమానం

- ఇప్పటికే ప్రతీరోజు 11 విమానాల రాకపోకలు
- ఢిల్లీ, ముంబాయి, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్‌కు సర్వీసులు
- 1500 మంది ప్రయాణం

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కోరుకొండ మండలం మధురపూడి గ్రామంలో ఉన్న రాజమండ్రి విమానాశ్రయానికి మహర్దశ పట్టింది. బుధవారం నుంచి రాజమండ్రి నుంచి తిరుపతికి విమాన సర్వీసులు ప్రారంభం అవుతున్నాయి. కేంద్ర పౌర విమానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పలువురు ప్రజాప్రతినిధులు, అధికార్ల సమక్షంలో బుధవారం ఈ సర్వీసును ప్రారంభించనున్నారు. వైమానిక సంస్థ అలయెన్స్ ఎయిర్ ఈ సర్వీసును నిర్వహిస్తోంది. ఇప్పటికే ఈ విమానాశ్రయం నుంచి 11 ఇండిగో విమానాలు న్యూఢిల్లీ, ముంబై, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్‌కు రాకపోకలు సాగిస్తున్న సంగతి తెలిసిందే. ఇటీవల విమాన ప్రయాణికుల సంఖ్య కూడా బాగా పెరిగింది. రోజుకు సుమారు 750 మంది ఇతర ప్రాంతాలకు వెళుతున్నారు మరో 750 మంది రాజమండ్రికి వస్తున్నారు. మొత్తం 1500 మంది రాకపోకలు సాగిస్తున్నారు. ఉదయం వెళ్లి సాయంత్రానికి ఇంటికి చేరుకునే అవకాశం దీంతో మరింత చేరువైంది. ఎప్పటినుంచో శ్రీవేంకటేశ్వరస్వామి కొలువైన తిరుపతికి భక్తులతోపాటు అనేక మంది విమాన సర్వీసును కోరుతున్నారు. అది ఇప్పటికి నెరవేరింది. ఇటీవల విమానాశ్రయాన్ని మరింత విస్తరిస్తున్న సంగతి తెలిసిందే. కార్గో సేవలు కూడా బాగా విస్తృతం కానున్నాయి.



యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

14 నెలల్లో 10,293 వీధికుక్కలకు ఆపరేషన్లు

ఏబీసీ సెంటర్ తనిఖీలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వచ్చాక రాజమహేంద్రవరంలో 14 నెలల్లో 10,293 వీధికుక్కలకు యానిమల్ బర్త్ కంట్రోల్ చేయించినట్టు ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు తెలిపారు. మంగళవారం ఆకస్మాత్తుగా రాజమహేంద్రవరం క్వారీసెంటర్ సమీపంలో ఉన్న ఏబీసీ సెంటర్‌ను ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు తనిఖీ చేశారు. అక్కడ ఉన్న సదుపాయాలు, ఆపరేషన్ థియేటర్, షెడ్స్, ఇతర సౌకర్యాలను పరిశీలించారు. పశు వైద్యులతో మాట్లాడి పరిస్థితిని ఆరాతీశారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఆదిరెడ్డి వాసు మాట్లాడారు. ఈ ఏబీసీ సెంటర్‌లో గత వైసీపీ పాలనలో ఐదేళ్లలో 12,100 వీధి కుక్కలకు ఆపరేషన్లు చేయగా, కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఏబీసీ సెంటర్‌లో సౌకర్యాలు మెరుగుపరిచామన్నారు. సిబ్బందిని పెంచామన్నారు. నగరంలో మొత్తం 50 వార్డులు కలిపి 29 వేల 91 కుక్కలు ఉన్నాయని గుర్తించి వేగంగా ఆపరేషన్లు చేయించామన్నారు. గతంలో సగటున నెలకు 300 ఆపరేషన్లు అయితే ఇప్పుడు నెలకు 850 చేస్తున్నారని చెప్పారు. నగరంలో ఇంకా 18,860 వీధి కుక్కలకు ఆపరేషన్ చేయాల్సివుందన్నారు. గతంలో నిర్లక్ష్యం వహించిన వైసీపీ వాళ్లు అవిగో కుక్కలు, ఇవిగో పిల్లులు అంటు చెబుతున్నారే తప్ప గతంలో మన నిర్లక్ష్యం వల్లనే కదా ఇదంతా అని అనుకోవడంలేదన్నారు. స్నేహ యానిమల్ వెల్ఫేర్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ సహకారంతో మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో యాంటిరేబిస్ వ్యాక్సినేషన్ వేస్తున్నారని వాసు తెలిపారు. నగర ప్రజలకు సంబంధించి ఎంత బాధ్యత ఉంటుందో, మూగజీవాల పట్ల తనకు అంతే బాధ్యత ఉందన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్, టీడీపీ నగర అధ్యక్షుడు మజ్జి రాంబాబు, టీడీపీ లీగల్ సెల్ నాయకుడు రాచపల్లి ప్రసాద్ పాల్గొన్నారు.



రూ.157 కోట్లు!

- వైసీపీ హయాంలో ఇసుక అక్రమాలు నిర్ధారించిన మైన్స్ అధికారులు
- ప్రభుత్వానికి నివేదిక.. జేపీ, ప్రతిమ కంపెనీలకు నోటీసులు
- 12చోట్ల జేపీ, 2 చోట్ల ప్రతిమ కంపెనీ అక్రమ తవ్వకాల ధ్రువీకరణ

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

వైసీపీ ప్రభుత్వ హయాంలో 2022 జనవరి నుంచి 2024 జూన్ వరకూ జిల్లాలో అక్రమ ఇసుక తవ్వకాల గుట్టు తేలింది. ఏకంగా రూ.157 కోట్ల 2లక్షల 72వేల 500 విలువైన అక్రమాలు జరిగినట్టు అధికారులు విచారణలో ధ్రువీకరణ అయింది. జిల్లాలో 14 ర్యాంపుల్లో 190.64 హెక్టార్లలో 30లక్షల11వేల 100టన్నుల మేర అక్రమ ఇసుక తవ్వకాలు జరిగినట్టు స్పష్టమైంది. వీటికి స్పందించిన నివేదికను జిల్లా అధికార యంత్రాంగం ప్రభుత్వానికి నివేదించింది. అక్రమ ఇసుక తవ్వకాలు జరిపిన కంపెనీ లకు నోటీసులు జారీచేసింది. అప్పట్లో జేపీ సంస్థకు కాంట్రాక్టు ఇచ్చినా, అనుమతిలేని ప్రాంతాల్లో పరిమితికి మించి ఇసుక తవ్వడం, 2024లో ప్రతిమ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ పేరిట మరి కొన్ని చోట్ల అక్రమాలు జరిగినట్టు తేలింది. నాటి వైసీపీ ప్రభుత్వం ఏవిధమైన నిబంధనలు లేకుండా నగదు రూపంలో డబ్బులు వసూలు చేయడంతోపాటు అనధికారకంగా డ్రెడ్జర్లతోనూ, యంత్రాల సహాయంతోనూ ఇసుక అక్రమాలకు పాల్పడింది. అప్పట్లో ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయని, యంత్రాలను కూడా ఉపయోగిస్తున్నారని, డ్రెడ్జింగ్ చేస్తున్నారని, వివిధ సంస్థల పేరిట వైసీపీ నేతలు దోపిడీ చేస్తున్నారని ఆరోపణలు వచ్చినా, కొందరు కోర్టుకు వెళ్లినా ఎవరూ పట్టించుకోని పరిస్థితి. తర్వాత సుప్రీంకోర్టు స్పందించడంతోపాటు, తెలుగుదేశం కూటమి ప్రభుత్వం కూడా ఈ అక్రమాలు వెలికి తీయించడంతో అక్రమాలు బయటపడ్డాయి.

అక్రమాలు లెక్కలేనన్ని..

జిల్లాలోని 14 రీచ్‌ల్లో అక్రమ ఇసుక తవ్వకాలు జరిగాయి. ఇందులో 12 గ్రామాల పరిధిలోని 12 రీచ్‌ల్లో మిస్టర్స్ జై ప్రకాష్ పవర్ వెంచర్స్ లిమిటెడ్ పేరిట అక్రమ తవ్వకాలు జరిగాయి. కొవ్వూరు మండలంలోని కుమారదేవం రీచ్‌లో 2020 జనవరి 17నుంచి 8.81 హెక్టార్లలో పరిమితికి మించి 88,100 క్యూబిక్ మీటర్లు ఇసుక తవ్వకాలు జరిగాయి. తాళ్లపూడి మండలంలోని బల్లిపాడు గ్రామ పరిధిలో 2022 జనవరి 29 నుంచి 6.03 హెక్టార్లలో 60,300 క్యూబిక్ మీటర్లు, వేగేశ్వరపురం గ్రామ పరిధిలో 2022 జనవరి 17నుంచి 15.28 హెక్టార్లలో 1లక్షా, 58వేల 800 క్యూబిక్ మీటర్లు ఇసుక అక్రమ తవ్వకాలు జరిగాయి. నిడదవోలు మండలంలోని పెండ్యాల గ్రామంలో అదే ఏడాది మే 30వ తేదీ నుంచి 31.34 హెక్టార్లలో 3 లక్షల 13,400 క్యూబిక్ మీటర్లు, పెరవలి మండలంలోని పందలపర్రులో అదే ఏడాది జనవరి 17 తేదీ నుంచి 7.72 హెక్టార్లలో 77,200 క్యూబిక్ మీటర్ల మేర, తీపర్రు గ్రామంలో అదే ఏడాది మే 30వ తేదీ నుంచి 9.9 హెక్టార్లలో 99వేల క్యూబిక్ మీటర్ల మేర, అదే తీపర్రులో మరోచోట అదే రోజు నుంచి 20.82 హెక్టార్లలో 2లక్షల 8వేల 200 క్యూబిక్ మీటర్ల మేర, అదే గ్రామంలో 2023 మే నెల 16వ తేదీ నుంచి 10.03 హెక్టార్లలో ఒక లక్షా 300 క్యూబిక్ మీటర్లు అదే ఏడాది అదే రోజు నుంచి ఇదే గ్రామంలో 46.27 హెక్టార్లలో 4లక్షల 62,700 క్యూబిక్ మీటర్ల ఇసుక అక్రమ తవ్వకాలు జరిగాయి. రాజమండ్రి రూరల్ మండలం పరిధిలోని తొర్రేడు గ్రామ పరిధిలో 2022 జనవరి 17న 5.86 హెక్టార్లలో 58వేల 600 క్యూబిక్ మీటర్ల మేర సీతానగరం మండలంలోని వంగలపూడి గ్రామ పరిధిలో అదే ఏడాది జనవరి 29న 10.64 హెక్టార్లలో 1లక్షా6వేల 400 క్యూబిక్ మీటర్ల మేర, కాటవరం గ్రామంలో అదే రోజు నుంచి 11.54 హెక్టార్లలో 1లక్షా15వేల 400 క్యూబిక్ మీటర్ల మేర అక్రమ ఇసుక తవ్వకాలు జరిగాయి. ఇక ప్రతిమ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ పేరిట తాళ్లపూడి మండలం పరిధిలోని బల్లిపాడు గ్రామంలో 2024 జూన్ 16న 10.01 హెక్టార్లలో 52వేల900 క్యూబిక్ మీటర్లు, పెరవలి మండలంలోని తీపర్రులో అదే ఏడాది అదే రోజు నుంచి 1.1 హెక్టార్లలో 1లక్షా 11వేల, 100 క్యూబిక్ మీటర్ల మేర అక్రమ తవ్వకాలు జరిగాయి. జిల్లాలో మొత్తం 20 లక్షల 7వేల 400 క్యూబిక్ మీటర్ల మేర అక్రమ ఇసుక తవ్వకాలు జరిగాయి.

టన్ను రూ.475 వంతున లెక్క

జిల్లాలో మొత్తం 20 లక్షల 7వేల 400 క్యూబిక్ మీటర్ల మేర అక్రమ ఇసుక తవ్వకాలు జరిగాయి. వీటిని టన్నులలో లెక్కిస్తే 30లక్షల 11వేల 100 టన్నులు అవుతుంది. ఓపెన్ ర్యాంపుల పేరిట అప్పట్లో టన్ను ఇసుకకు రూ.475 వసూలు వైసీపీ వర్గాల పేరిట ఈ సంస్థలు వసూలు చేశాయి. టన్నుకు రూ.475 లెక్కన మొత్తం 30లక్షల 11వేల 100 టన్ను ఇసుక విలువ రూ.157 కోట్ల 2లక్షల, 72వేల 500 అయింది. ఈమేరకు మైన్స్ అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి అంటే మైన్స్ కమిషనర్‌కు నివేదిక పంపడంతోపాటు జేపీ, ప్రతిమా సంస్థలకు నోటీసులు జారీ చేశారు. వాస్తవానికి ఈ కంపెనీల పేరిట వైసీపీ నేతలే అధికంగా దోచుకున్న వైనం తెలిసిందే.



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న జేడీ నిర్మలా కుమారి

జీఎస్టీ సర్దుబాటుతో మత్స్యకార రంగానికి ఆర్థిక ఉపశమనం : మత్స్యశాఖ జేడీ

రాజానగరం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కొత్త జీఎస్టీ సర్దుబాట్లతో మత్స్యకార రంగానికి ఎంతో ప్రయోజనం చేకూరుతుందని జిల్లా మత్స్యశాఖ జేడీ ఎస్.నిర్మలాకుమారి పేర్కొన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలంలోని నరేంద్రపురం గ్రామంలో మంగళవారం జీఎస్టీ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మలాకుమారి మాట్లాడుతూ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ ప్రచారం ఈనెల 22 నుంచి అమల్లోకి వచ్చిందన్నారు. జీఎస్టీ రేట్లు తగ్గింపు ప్రయోజనాలను ఆక్వా రైతులు, మత్స్యకారులు, ఇతర వాటాదారులకు తెలియజేసేందుకు ఈ కార్యక్రమం చేపట్టారని వివరించారు. ముఖ్యంగా సముద్ర ఉత్పత్తులు, ప్రాసెస్ చేసిన చేసిన చేపలు, రొయ్యలు, చేప నూనెలు, సేంద్రియ సారములపై జీఎస్టీ 12 నుంచి 5 శాతానికి తగ్గించబడిందన్నారు. ఆక్వా కల్చర్ పరికరాలు, ఇన్‌పుట్ సబ్సిడీ, ఫిషింగ్ గేర్, అమ్మోనియా, సూక్ష్మ పోషకాలు, ప్రాసెసింగ్ సేవలపై కూడా జీఎస్టీ తగ్గింపు వర్తిస్తుందన్నారు. ఇప్పటికే ప్రభుత్వం ఏపీఎస్ఏడీఏలో నమోదు చేసుకున్న ఆక్వా రైతులకు యూనిట్ విద్యుత్‌కు రూ.1.50 వంతున రాయితీ అందిస్తోందన్నారు. నాన్ ఆక్వా జోన్లోని ఆక్వా ఫార్మర్లకు కూడా విద్యుత్ రాయితీ పొడిగింపు పరిగణలో ఉందని, ఈ సౌకర్యం ద్వారా ఎకరానికి సగటున రూ.20 వేలు ఆదా అవుతుందన్నారు. ఈ మార్పులు ఆక్వా రైతులు, ఎగుమతిదారులు ఎదుర్కొనే ఆర్థిక ఒత్తిళ్లను తగ్గించడమే కాకుండా స్థానిక మత్స్య ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం, భారతీయ ఎగుమతుల పోటీతత్వాన్ని పెంపొందించడంలో ముఖ్యపాత్ర పోషిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ సహాయ సంచాలకులు టి.సుమలత, అభివృద్ధి అధికారులు ఎస్.గణేశ్వరరావు, ఎం.బ్రహ్మానందం, అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ కె.హరీష్, సర్పంచ్ తంగెళ్ల మునలయ్య, మత్స్యకారుల సహకార సొసైటీ అధ్యక్షుడు బొర్రా ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.


కొవ్వూరు గోష్పాదక్షేత్రం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్నవరద గోదావరి

ఉగ్రరూపం దాల్చిన గోదావరి

● గోష్పాదక్షేత్రం మెట్లను ముంచెత్తిన వరద

కొవ్వూరు, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాలలో కురుస్తున్న భారీ వర్షాలకు అఖండ గోదావరి ఉగ్రరూపం దాల్చి ప్రవహిస్తోంది. కొవ్వూరు గోష్పాదక్షేత్రంలోని ప్రధాన స్నానఘట్టాలు వరద ముంపులోనే కొనసాగుతున్నాయి. స్నానఘట్టాలపై ఉన్న శివలింగాలను వరద ముంచెత్తింది. భద్రాచలం నుంచి వరద ప్రవాహం ధవళేశ్వరం బ్యారేజ్ చేరుకోవడానికి 18 గంటల సమయం పడుతుంది. ఎగువన భద్రాచలంవద్ద ప్రమాద హెచ్చరికలు దాటి ప్రవహిస్తోంది. దిగువన మరింత వరద పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. వరద గోదావరిని చూడడానికి పట్టణ పరిసర ప్రాంతాల నుంచి అధికసంఖ్యలో పర్యాటకులు కొవ్వూరు గోష్పాదక్షేత్రానికి చేరుకుంటున్నారు. గతకొన్ని రోజులుగా క్షేత్రంలోని ప్రధాన స్నానఘట్టాలు నీటమునిగే ఉన్నాయి. భక్తులు స్నానాలు చేసేందుకు అనుమతించడం లేదు. ఎంతచెప్పినా వినకపోవడంతో అధికారులు స్నానఘట్టాలలో ఎవ్వరూ దిగకుండా అడ్డంగా భారీకేడ్లు ఏర్పాటుచేశారు.


తీపర్రు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

పెరవలి(ఆంధ్రజ్యోతి): ఒక్కసారిగా పెరిగిన గోదావరి వరదతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గత నెల రోజులుగా గోదావరి వరద తరచూ పెరుగుతూ ఉంది. గత రెండురోజులుగా ఎగువ భాగంలో వచ్చిన వరదతో ఈ ప్రాంతంలో కూడా ఒక్కసారిగా వరద పెరిగి పల్లపులంక భూములు నీటమునిగాయి. అరటి తోటలు, పచ్చ గడ్డి బీడులు నీట మునిగాయి. ఖండవల్లి, ముక్కామల, కాకరపర్రు, ఉసులుమర్రు, కానూరు అగ్రహారం గ్రామాల పరిధిలో ఇప్పటికే వందలాదిఎకరాలు నీట మునిగాయి.

నూతన ఉపాధ్యాయులకు

3వ తేదీ నుంచి ఇండక్షన్ ట్రైనింగ్

కొవ్వూరు, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు డివిజన్ పరిధిలో తొమ్మిది మండలాల నుంచి మెగా డీఎస్సీ-2025లో ఎంపికైన నూతన ఉపాధ్యాయులకు అక్టోబరు 3 నుంచి 10వ తేదీ వరకు ఇండక్షన్ ట్రైనింగ్ నిర్వహిస్తున్నట్లు పశ్చిమగోదావరిజిల్లా విద్యాశాఖాధికారి ఈ. నారాయణరావు తెలిపారు. ట్రైనింగ్ రెసిడెన్షియల్ మోడ్‌లో జరుగుతుందన్నారు. శిక్షణ పూర్తయిన తరువాత ఉపాధ్యాయులకు పోస్టింగ్ ఇస్తామన్నారు. శిక్షణకు హాజరుకాని వారికి తదుపరి నిర్వహించే శిక్షణ తరగతులలో ట్రైనింగ్ పూర్తిచేసిన తరువాత మాత్రమే పోస్టింగ్ పొందగలరన్నారు. శిక్షణలో పాల్గొనే ఉపాధ్యాయుల బెడ్‌షీట్స్, జాగింగ్‌కోసం రన్నింగ్ షూస్, ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్, వ్యక్తిగత సామాగ్రి తెచ్చుకోవాలన్నారు. ఫార్మల్ డ్రెస్ కోడ్ పాటించాలన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారు అవసరమైన మందులు వెంట తెచ్చుకోవాలన్నారు. కేటగిరీల వారీగా 4శిక్షణ వేదికలు ఏర్పాటుచేశామన్నారు. 1. తెలుగు, హిందీ, గణితం, ఇంగ్లీషు, సంస్కృతం, భౌతికశాస్త్రం, జీవశాస్త్రం స్కూల్ అసిస్టెంట్స్ ఉపాధ్యాయులకు భీమవరం గొల్లలకోడేరు రోడ్‌లో ఉన్న ఢిల్లీ పబ్లిక్‌స్కూల్. 2. సోషల్‌స్టడీస్, ఫిజికల్ ఎడ్యుకేషన్ స్కూల్ అసిస్టెంట్స్ కోసం నరసాపురం సీతారాంపురంలోని స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాల. 3. సెకండ్ గ్రేడ్ ఉపాధ్యాయులకు తణుకు ఓల్డ్ టౌన్‌లోని ఎస్‌కెఎస్‌డీ మహిళా కళాశాల. 4.సెకండ్ గ్రేడ్ ఉపాధ్యాయులకు ఇండస్ట్రీయల్ ఏరియాలోని సీఎస్ఎన్ ఎస్టేట్‌లో శిక్షణ తరగతులు ఏర్పాటుచేస్తామన్నారు. మెగా డీఎస్సీలో నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులు తప్పనిసరిగా ఈ శిక్షణలో పాల్గొనాలన్నారు.

పీహెచ్‌సీకి కుర్చీల అందజేత



దేవరపల్లి పీహెచ్‌సీకి కుర్చీలు అందజేసిన లయన్స్‌క్లబ్

దేవరపల్లి, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): దేవరపల్లి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రూ.10వేల విలువచేసే పదికుర్చీలను ఆసుపత్రికి అందజేశారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు రామరహిత మాట్లాడుతూ దేవరపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కూర్చునేందుకు కుర్చీల కొరత ఉందని ఆసుపత్రి సిబ్బంది కోరటంతో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో కుర్చీలు అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ కోశాధికారి పెందుర్తి సుధీర్, సభ్యులు శంకర రామారావు, జ్యేష్ఠ సతీశ్, నలమాటి లలిత, పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్తేరురాణి, వైద్యాధికారులు పిన్నమని పాపారావు, సిబ్బంది పాల్గొన్నారు.

సూర్యారావుపాలెంలో వైద్య శిబిరం

ఉండ్రాజవరం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూర్యారావుపాలెం గ్రామంలో స్వస్థ నారి-సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో పీహెచ్‌సీ డాక్టరు సృజన ఆధ్వర్యంలో రోగులకు పరీక్షలు చేశారు. అవసరమైన రోగులకు మందులు అందజేశా రు. మహిళలకు సంబంధించిన వివిధ రకాల పరీక్షలు చేసి, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

దుర్గమ్మా.. కరుణించమ్మా!

● దుర్గాదేవి అలంకరణలో అమ్మవారు
● ఘనంగా చండీహోమం
● కోట సత్తెమ్మకి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో కోట సత్తెమ్మ | దుర్గామాత అవతారంలో జ్ఞాన సరస్వతి

నిడదవోలు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం గ్రామంలో ఉన్న కోటసత్తెమ్మ అమ్మవారి దేవస్థానంలో మంగళవారం దేవీనవరాత్రి మహోత్సవాలలో దుర్గాష్టమి సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి నిత్యాభిషేకం, ప్రత్యేక సహస్రనామ కుంకుమ పూజలు, చండీ పారాయణం, సాయంత్రం హోమం నిర్వహించారు. అమ్మవారికి నిర్వహించిన కుంకుమ పూజలలో సుమారు 392 మంది దంపతులు పాల్గొన్నారు.

వాసవీమాతకు మంత్రి దుర్గేష్ పూజలు


నిడదవోలులో వాసవీమాతకు పూజలు చేస్తున్న మంత్రి దుర్గేష్

నిడదవోలు పట్టణంలో జరుగుతున్న శరన్నవరాత్రి మహోత్సవాలలో మంగళవారం దుర్గాష్టమి సందర్భంగా వాసవీ కన్యకా పరమేశ్వరిమాతను రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి కందుల దుర్గేష్ దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు. శరన్నవ రాత్రులలో వాసవీ కన్యకాపరమేశ్వరి మాతను దర్శించుకోవడం ఎంతో సంతోషాన్ని కలిగించిందన్నారు. ఆయన వెంట మునిసిపల్ చైర్మన్ భూపతిఆదినారాయణ, కూటమినాయకులు పాల్గొన్నారు.

చాగల్లు(ఆంధ్రజ్యోతి): మండలంలో దేవీ శరన్నవరాత్రులు వేడుకగా జరుగుతున్నాయి. మండల కేంద్రమైన చాగల్లు సెంటర్‌లోని శ్రీకన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో అమ్మవారు శ్రీదుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈసందర్భంగా ఆలయ ప్రాంగణంలో సామూహిక చండీహోమం, పూర్ణాహుతి నిర్వహించారు. వేద పండితులు రాజశేఖర్‌శాస్త్రి ఆధ్వర్యంలో జరిగిన హోమం కార్యక్రమంలో దంపతులు జంటలుగా పాల్గొని పూజలు చేశారు. ఒల్లుగుంట శ్రీకనకదుర్గమ్మవారి ఆలయంలోను దేవి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కుంకుమ పూజలు చేశారు. ఊనగట్ల శ్రీకనకదుర్గమ్మ వారి ఆలయంలోను ఉత్సవాలు వేడుకగా జరుగుతున్నాయి.

దుర్గామాత అవతారంలో బాలాత్రిపుర సుందరి

కొవ్వూరు(ఆంధ్రజ్యోతి): కొవ్వూరుగోష్పాదక్షేత్రంలో ఉన్న బాలాత్రిపుర సుందరీ అమ్మవారు దుర్గామాత అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకుడు మానేపల్లి సుందరగణేష్ ఆధ్వర్యంలో మంగళవారం అమ్మవారిని దుర్గామాతగా అలంకరించారు. మహిళలు సామూహిక కుంకుమపూజలు చేశారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. భక్తులు, మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు. జ్ఞానసరస్వతి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని భక్తులు దుర్గామాతగా అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారిని సంఘం అధ్యక్షుడు నాళం శ్రీనివాసరావు పర్యవేక్షణలో వాసవీ ట్రస్టు అధ్యక్షుడు పెరుమాళ్ళ వీరేశ్వరరావు ఆధ్వర్యంలో దుర్గామాతగా అలంకరించి విశేషపూజలు చేశారు. పట్టణ పరిసర ప్రాంతాలకు చెందిన ఆర్యవైశ్యులు అధికసంఖ్యలో పాల్గొని వాసవీమాతను దర్శించుకున్నారు.


దేవరపల్లిలో బతుకమ్మకు పాటలుపాడుతూ నృత్యం చేస్తున్న మహిళలు

దుర్గాదేవికి ప్రత్యేక కుంకుమ పూజలు

తాళ్లపూడి(ఆంధ్రజ్యోతి): దేవీ నవరాత్రుల సందర్భంగా మండలంలో పలు ఆలయాల్లో కనకదుర్గమ్మ అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. అన్నదేవరపేట గ్రామంలోని బీసీ కాలనీలో ఉన్న కనకదుర్గ అమ్మవారు ఆలయంవద్ద మంగళవారం అర్చకులు పెద్దింటి శ్యాంసుందర్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సామూహిక కుంకుమ పూజలలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రముఖులు అల్లూరి విక్రమాదిత్య, ముళ్లపూడి శ్రీరామచంద్రమూర్తి, డాక్టరు దత్తాత్రేయులు తదితరులు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. అర్చకులు శ్యాంసుందర్ అతిథులను వేదాశీర్వచనంతో సత్కరించా రు. తాళ్లపూడి నవదుర్గా ఆలయంలో కనక దుర్గమ్మ అమ్మవారు పత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

వైభవంగా బతుకమ్మ సంబరాలు

దేవరపల్లి(ఆంధ్రజ్యోతి): దేవరపల్లిలో మూడుబొమ్మల సెంటర్‌వద్ద సౌభాగ్య దుర్గాంబిక ఆలయంవద్ద దసరా మహోత్సవాల్లో భాగంగా అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు, కుంకుమపూజలు నిర్వహించారు. సాయంత్రం వైభవంగా బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ముందుగా బతుకమ్మను తలపై ధరించి గ్రామోత్సవం నిర్వహించి ఆలయం వద్దకు వచ్చారు. ఆలయం వద్ద వేదపండితులు పెడనిగంటి సాయి బాబు, శశికాంత్‌శర్మ ఆధ్వర్యంలో బతుకమ్మ అమ్మవారి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. బతుకమ్మపాటలు పాడుతూ మహిళలు నృత్యప్రదర్శన చేశారు. అనంతరం బాణసంచాలతో డప్పువాయిద్యాలతో అమ్మవారిని అన్ని దేవాలయాలు దర్శించి ఊరచెరువులో నిమజ్జనం చేశారు.


తాళ్లపూడిలో ప్రత్యేక అలంకరణలో కనకదుర్గ అమ్మవారు | చాగల్లులో శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయంలో చండీహోమం నిర్వహిస్తున్న దృశ్యం

చింతాలమ్మకు ప్రత్యేక పూజలు

పెరవలి(ఆంధ్రజ్యోతి): దేవి నవరాత్రులు సందర్భంగా తీపర్రులో ఉన్న శ్రీ చింతాలమ్మ అమ్మవారి ఆలయంలో ప్రతీరోజూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. భవానీ మాల వేసిన పలువురు భక్తులు ఆలయం వద్ద వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా బుధవారం ఆలయం వద్ద అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

జీఎస్టీ తగ్గింపుపై క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

● ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుపై క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు కూటమి నాయకులను ఆదేశించారు. మంగళవారం కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గస్థాయి కూటమి నాయకులతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపుపై సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై గ్రామాలలో ఇంటింటా ప్రచారం నిర్వహించాలన్నారు. జీఎస్టీ 28శాతం ఉన్న వస్తువులపై 18శాతం నుంచి 5.5శాతం ఉన్న వస్తువులపై పూర్తిగా జీఎస్టీ ఎత్తివేశారు. ప్రతినెలా 1వ తేదీ నుంచి 19వరకు గ్రామాల్లో నిర్వహించే ప్రభుత్వ కార్యక్రమాల్లో కూటమి నాయకులు భాగస్వాములు కావాలన్నారు. పింఛను, రేషన్ పంపిణీ కార్యక్రమాలను పర్యవేక్షించాలన్నారు. మూడు పార్టీల నాయకులు సమన్వయంతో పనిచేస్తేనే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ఘన విజయం సాధిస్తుందన్నారు. కేంద్రం నుంచి విడుదలలో కొంత జాప్యం కావడంతో జాతీయ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనుల బిల్లుల చెల్లింపులలో కొంత ఆలస్యమైందన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ పనులకు నిధులు త్వరితగతిన అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. గోదావరి పుష్కరాలకు గ్రామాలవారీగా అభివృద్ధి పనుల నివేదికలు అందజేయాలన్నారు. గోకులం షెడ్ల నిర్మాణ పనులు త్వరలో చేపట్టనున్నామన్నారు. నియోజకవర్గంలోని జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు దాతల సహకారంతో సమకూరుస్తామన్నారు.కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి రూ.15లక్షల విలువైన జనరేటర్ ఏర్పాటుచేస్తున్నామన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో కూటమి నాయకులకు సభ్యత్వాలు అం దించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సొసైటీలలో తీసుకున్న రుణాలను సకాలంలో తిరిగి చెల్లించాలన్నారు. జనవరిలో మున్సిపాల్టీ, మార్చిలో జడ్పీటీసీ ఎన్నిక లు వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. సీట్లు కేటాయి ంపు రాష్ట్రస్థాయిలో కూటమి పెద్దలు నిర్ణయిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, సూరపనేని చిన్ని, దాయన రామకృష్ణ, వట్టికూటి వెంకటేశ్వరరావు, బేతిన నారాయణ, జడ్పీటీసీ బొంతా వెంకటలక్ష్మి, జి.సురేష్, చావా శ్రీనివాసరావు, కేవీకే రంగారావు, జనసేన నాయకులు ఉప్పులూరి బాబ్జి, సుంకర సత్తిబాబు, గంటా కృష్ణ పాల్గొన్నారు.

సాంబారు గిన్నెలో పడి

బాలుడికి తీవ్రగాయాలు


గాయపడిన బాలుడు చరణ్

దేవరపల్లి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి):దేవరపల్లి మండలం యర్నగూడెంలో ప్రమాదవశాత్తూ బాలుడు సాంబార్ గిన్నెలో పడిపోవడంతో తీవ్రగాయాలయ్యాయి. యర్నగూడెం గ్రామానికి చెందిన పనిశెట్టి గంగాభవాని కర్రీ పాయింట్ నడుపు తున్నారు. ఆమెకు ఇద్దరు పిల్లలు. మంగళవారం ఉదయం కర్రీ పా యింట్ కోసం కూరలు సిద్ధం చేస్తుండగా చిన్నకుమారుడు చరణ్ ఆడుకుంటూ ప్రమాదవశాత్తూ సాంబారుగిన్నెలో కూర్చోవడంతో పొట్ట కిందభాగం కాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. టీడీపీ పార్టీ నాయ కులు పెనుమత్స సుబ్బ రాజు అంబులెన్స్‌లో రాజమహేంద్రవరం ప్రైవేటు ఆసుపత్రికి చరణ్‌ను తరలించారు. బాలుడు చరణ్ ఆరోగ్యపరిస్థితి నిలకడగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నిడదవోలు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు మండలం అట్లపాడు గ్రామానికి చెందిన తిరు మల గౌతం మునేశ్వరరావు (70) ఈనెల 26న మద్యంలో పురుగుల మందు కలుపుకుని తాగి ఆత్మహ త్యకు ప్రయత్నించాడు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడని దీనిపై మంగళవారం కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సమిశ్రగూడెం ఎస్ఐ బాలాజీ సుందరరావు తెలిపారు. మృతుడి కుమారుడు చీటీలు వేసి పరారు కావడంతో పోలీస్ స్టేషన్లో కేసులు కూడా నమోదయ్యాయి.



'అన్నసమారాధనలు ప్లాస్టిక్ రహితంగా నిర్వహించాలి'

పెరవలి,సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): దేవీ నవరాత్రులు సందర్భంగా ఆయా గ్రామాల్లో అన్న సమారాధనలు ప్లాస్టిక్ రహితంగా నిర్వహించు కోవాలని మల్లేశ్వరం పాఠశాల ఉపాధ్యాయులు నాగభూషణం కోరారు. ఈవిధంగా మల్లేశ్వరంలో మంగళవారం అన్నసమారాధన నిర్వహించామని ఈ సందర్భంగా ప్లాస్టిక్ పేట్లు, గ్లాసులు వాడలేదని స్టీలు గ్లాసులలో మంచినీరు అందించామని తెలిపారు. టుబల్స్‌పై కూర్చున్న వారికి అరటి ఆకుల్లోనూ బఫే భోజనాలు చేసే వారికి స్టీలు ప్లేట్లలోనూ భోజనాలు వడ్డిం చినట్లు తెలిపారు. ఈవిధంగా అన్నిచోట్ల జరిగే కార్యక్రమాల్లో ఈ విధంగా చూడాలన్నారు. అన్నసమారాధనలకు స్టీలు గ్లాస్‌లు, ప్లేట్లు కావాలంటే తమను సంప్రదించాలన్నారు.













సూరంపాలెం నుంచి నీటి సరఫరాకు చర్యలు

» ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ



రైతుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బత్తుల

కోరుకొండ, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): సూరంపాలెం రిజర్వాయర్ నుంచి కణుపూరు గ్రామ రైతులకు సాగు నీరందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. సూరంపాలెం రిజర్వాయర్ ప్రాజెక్ట్ అధికారులతో కలిసి ఆయన కణుపూరు గ్రామంలో పర్యటించి రైతుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలోని కణుపూరుకు సూరంపాలెం రిజర్వాయర్ ద్వారా సాగు నీరు రావాలి .కానీ రిజర్వాయర్ నీటినిల్వ తక్కువ ఉన్నందున కాలువ ద్వారా నీటిని విడుదల చేయలేదు. దీంతో గ్రామంలో 60 ఎకరాలకు సాగు నీరందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కూటమి నాయకుల ద్వారా విషయం తెలుసుకుని పొలాలను సూరంపాలెం రిజర్వాయర్ డీఈ, ఏఈలతో కలిసి పరిశీలించామన్నారు. స్థానికంగా ఉన్న ఊరచెరువు కూడా పూర్తిగా పూడికతో నిండిపోవడం వల్ల నీటిని నిల్వ చేయడానికి తగినంత సామర్థ్యం లేదని, రైతులను ఆదుకునేందుకు సొంత నిధులతో సూరంపాలెం కాలువ పూడిక తీయించి సాగు నీరం దించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. చెరువుల నిల్వ సామర్థ్యం పెంచడానికి పూడిక తీతలు, తూముల మరమ్మతులు చేయిస్తామన్నారు. సూరంపాలెం రిజర్వాయర్ అధికారులు కూడా పూర్తి సహకారం అందిస్తున్నారన్నారు. రూ.32కోట్లతో రైతులకు సక్రమంగా సాగు నీరందించేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. కణుపూరుకు పుష్కర కాలువ ద్వారా కూడా ఒక లిఫ్ట్ ఏర్పాటు చేసి త్వరలోనే సాగు నీరందించేలా చర్యలు చేపట్టామన్నారు. నియోజకవర్గంలో చివరి ఎకరా వరకు సాగునీటిని అందించడానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బత్తుల అన్నారు.

సీఎం సహాయనిధి పేదలకు భరోసా

చెక్కుల పంపిణీలో మంత్రి కందుల దుర్గేష్



ఉండ్రాజవరంలో లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేస్తున్న మంత్రి దుర్గేష్



సీఎం సహాయనిధి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

ఉండ్రాజవరం, సెప్టెంబరు, 30(ఆంధ్రజ్యోతి): పేదలకు సీఎం సహాయనిధి ఆర్థిక భరోసా కల్పిస్తున్నట్లు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖామంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. మంగళవారం ఉండ్రా జవరంలో నిడదవోలు నియోజకవర్గంలోని 44మంది లబ్ధిదారులకు రూ.25.52లక్షల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంత్రి దుర్గేష్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇప్పటివరకు 388 మందికి రూ.3.10కోట్లు విలువైన చెక్కులను అందజేశామన్నారు. సీఎం సహాయనిధి ప్రభుత్వం రోగులను ఆదుకుంటున్నట్లు తెలిపారు. రోగులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం సీఎం సహాయనిధి ద్వారా నిరంతరం ఆర్థికసహాయం అందిస్తుందని మంత్రి దుర్గేష్ చెప్పారు. వర్షాలు తగ్గిన వెంటనే నిడదవోలు నియోజకవర్గంలో ప్రధాన రహదారులన్నీ బాగుచేస్తామని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యం, నియోజకవర్గ అభివృద్ధి, మరోవైపు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు మంత్రి దుర్గేష్ చెప్పారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు సింహాద్రి రామకృష్ణ, జనసేన అధ్యక్షుడు వీరమల్ల బా లాజీ, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

చాగల్లు, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం కొవ్వూరు టీడీపీ పార్టీ ఆఫీసులో జరిగిన కార్యక్రమంలో మండలంలోని దారవరంకి చెందిన గూటం దీప్తికి సీఎం సహాయనిధి చెక్కు రూ39,800. మంజూరు అయ్యాయి. ఈ చెక్కును ఆమె తండ్రి గూటం వెంకటేశ్వరరావుకు ఎమ్మెల్యేచేతుల అందజేశారు. ఈకార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నాదెళ్ళ శ్రీరామ్‌చౌదరి, టీడీపీ నాయకులు బొడ్డు రాజు, మద్దిపాటి వీరరాఘవులు, బొడ్డు కేశవకుమార్, వీరేంద్ర చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు - నరసాపురం కాలువపై

ప్రమాదకరంగా తీపర్రు వంతెన అప్రోచ్ రోడ్డు

● పట్టించుకోని అధికారులు



దిగబడిన పోయిన వంతెన అప్రోచ్ రోడ్డు

పెరవలి, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): నిడదవోలు-నరసాపురం కాలువపై తీపర్రువంతెన అప్రోచ్ రోడ్డు ప్రమాదకరంగా మారడంతో వాహనదారులు భయాందోళనకు చెందుతున్నారు. ఈ వంతెన మీదుగా వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటారు. ఉండ్రాజవరం, తణుకు వెళ్లడానికి ఈ రోడ్డు దగ్గరమార్గం కావడంతో ప్రతీనిత్యం లారీలు, ఆటోలు , కాన్వెంట్ బస్సులు మోటారు సైకిళ్లు రాకపోకలు సాగిస్తుంటాయి. తాడిపర్రువైపు అప్రోచ్ రోడ్డు కాలువలోకి దిగబడి పోవడంతో ఎపుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు వాపోతున్నారు. గతంలో మంత్రి కూడా రెండుసార్లు వచ్చి పరిశీలించారు. ఇక్కడ తాత్కాలిక మరమ్మతులు చేసి పూర్తిస్థాయిలో పటిష్టం చేస్తామని ఇంజనీరింగ్ అధికారులు మంత్రికి హామీ ఇచ్చారు. గత మే నెలలో కాలువలు బంద్ చేసినా ఇక్కడ ఎటువంటి పనులు జరుగలేదు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో గట్టు మరింత బలహీనపడి రాత్రి సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాహన దారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

డిసెంబరు 13న బ్రాహ్మణ యువతకు జాబ్ మేళా

రాజమహేంద్రవరం కల్చరల్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఏపీ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఆధ్వర్యంలో డిసెంబరు 13న గుంటూరు హిందూ కాలేజీ ఆఫ్ ఫార్మసీలో బ్రాహ్మణ యువతకు జాబ్‌మేళా జరుగుతుందని బ్రాహ్మణ సంఘం నగర అధ్యక్షుడు పుత్రేవు సూర్య వెంకటరావు తెలిపారు. ఈ మేరకు రాజమహేంద్రవరం కోటిపల్లి బస్టాండ్ సమీపంలోని బ్రాహ్మణ సమాఖ్య ప్రాంతీయ కార్యాలయంలో సంఘ నాయకులు పోస్టర్‌ను ఆవిష్కరించారు. బ్రోచర్లో ఉదహరించిన క్యూ ఆర్ కోడ్ ద్వారా నవంబరు 23వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని చెప్పారు. వివరాలకు సంఘ సమ్మాఖ్య ప్రాంతీయ కార్యాలయంలో లేదా 98482 06020కు ఫోను లేదా వాట్సప్ ద్వారా సంప్రదించవచ్చని వెంకటరావు తెలిపారు. కార్యక్రమంలో కలగ ప్రభాకరం, భాగవతి నారాయణశాస్త్రి, వాడ్రేవు వేణుగోపాలరావు పాల్గొన్నారు.

రెండవ అంతస్తు నుంచి జారిపడి వ్యక్తి మృతి

బిక్కవోలు, సెప్టెంబరు (ఆంధ్రజ్యోతి): అనపర్తికి చెందిన బురిడి శ్రీను(36) ప్రమాదవశాత్తు రెండవ అంతస్తు నుంచి కాలుజారి మృతి చెందాడు. బిక్కవోలు ఎస్‌ఐ వి. రవిచంద్రకుమార్ తెలిపిన వివరాల ప్రకారం శ్రీను రాడ్ బెండింగ్ పని చేస్తుంటాడని మంగళవారం ఉదయం పనికి బలభద్రపురం వచ్చి రెండవ అంతస్తులో పని చేస్తుండగా కాలుజారి పడ్డాడని దీంతో తలకు తీవ్రగాయాలు కావడంతో అతనిని అనపర్తి ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడన్నారు. శ్రీను భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసామన్నారు.

ఎల్ఐసీ ఏజెంట్ కుటుంబానికి ఆర్థికసాయం

రాజమహేంద్రవరంరూరల్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఇటీవల రాజమహేంద్రవరం రూరల్ ఎల్ఐసీ ఏజెంట్ ఎం.ప్రదీప్ అనారోగ్యానికి గురయ్యాడు. ఏజెంట్లు సంఘం విషయాన్ని తెలుసుకుని ఆస్పత్రికి వెళ్లి వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యసేవలు అందించాలని కోరారు. ప్రదీప్ వైద్యానికి అవసరమైన రక్తం ఇచ్చారు. ఏజెంట్లు సంఘం అధ్యక్షుడు ఆదిమూలం సాయిబాబా పిలుపు మేరకు సంఘం ఏజెంట్లు నుంచి రూ.25 వేలు సేకరించారు. ఆసుపత్రికి వెళ్లి ఈ సొమ్మును మంగళవారం సాయిబాబా, డివిజన్ ఉపాధ్యక్షుడు జీకే చంద్రశేఖర్, మట్టా సత్యనారాయణ, యర్నాగుల రామ్మోహనరావు, ఈసీ మెంబర్లు ప్రదీప్ కుటుంబానికి అందజేశారు.

ఆంధ్రజ్యోతికి 23వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
కొవ్వూరు నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ ముప్పిడి వెంకటేశ్వరరావు గార్కి
కొవ్వూరు నియోజకవర్గ ప్రజలకు, నాయకులకు, ప్రజా ప్రతినిధులకు,
విజయదశమి & దీపావళి శుభాకాంక్షలు
అభిమానులు

ఆంధ్రజ్యోతికి 23వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
అల్లూరి బాపినీడు & పెండ్యాల రంగారావు డిగ్రీ & పి.జి.కళాశాల
కొవ్వూరు, తూ.గో.జిల్లా ఫోన్ : 08813-232907
డా॥ శ్రీ అల్లూరి ఇంద్రకుమార్ చైర్మన్
శ్రీ నూతక్కి రాంప్రసాద్ సెక్రటరీ & కరస్పాండెంట్
B.Sc కళాశాలలో బోధించబడు కోర్సులు
B.Sc (Honours) Computer Science
B.Sc (Honours) Chemistry
B.Sc (Honours) Data Science
B.Sc (Honours) Biotechnology
B.Sc (Honours) Microbiology
B.Com
B.Com (Honours) Computer Application
B.Com (Honours) Commerce
PG.M.Sc
Analytical Chemistry
Organic Chemistry
ఆదికవి నన్నయ్య యూనివర్శిటీ పరిధిలో అత్యున్నత ప్రమాణాలతో క్రమ శిక్షణతో కూడిన విద్యను అందిస్తున్న ఏకైక విద్యాసంస్థ.
మా విద్యార్థినీ విద్యార్థులకు ప్రముఖ కంపెనీలు జరుపు ప్రాంగణ ఎంపికలకు శిక్షణ (CRT) అందిస్తున్నాము.
OUR CAMPUS PLACEMENTS 570+ STUDENTS Selected From 2021-22 to 2024-25 Batches
wipro 115, Infosys 37, Laurus Labs 100, 162, accenture 34, Deloitte 2, Atos Syntel 3, tcs 64, Capgemini 22, Avanti 10, Hexaware 8, Mindtree 1, Hetero Drugs 8, cognizant 1
CAMPUS INTERVIEWS ARE STILL GOING ON FOR FINAL YEAR (2024-25) STUDENTS
ప్రిన్సిపాల్: డా. యం. రామ్మోహన్ M.Sc., M.Phil.Ph.D
నందిగం వెంకట సుబ్బారావు Advisor, మరియు సిబ్బంది

ఆంధ్రజ్యోతికి 23 వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
కొవ్వూరు నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ ముప్పిడి వెంకటేశ్వరరావు గార్కి మరియు,
కొవ్వూరు నియోజకవర్గ ప్రజలకు, నాయకులకు, ప్రజా ప్రతినిధులకు,రైతులకు, ఖాతాదారులకు,
విజయదశమి దీపావళి శుభాకాంక్షలు
సి.హెచ్.ఎస్.కె.ఆదిత్య సొసైటి కార్యదర్శి, కొవ్వూరు
ఉప్పులూరి ప్రసాద్ పర్సన్
దండుబోయిన మురళీకృష్ణ పర్సన్
కంఠమణి రామకృష్ణారావు పర్సన్ ఇన్‌చార్జ్, పి.ఏ.సి.ఎస్. కొవ్వూరు, ద్విసభ్య కమిటీ సభ్యులు - కొవ్వూరు నియోజకవర్గం
శ్రీ రామా ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం, కొవ్వూరు

ఆంధ్రజ్యోతికి 23వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
పశివేదల గ్రామ ప్రజలకు, టిడిపి నాయకులకు, కార్యకర్తలకు, శ్రేయోభిలాషులకు, మిత్రులకు
దసరా మరియు దీపావళి శుభాకాంక్షలు
శ్రీమతి తుంపల్లి సింహాచలం సర్పంచ్, పశివేదల
శ్రీ ఆలపాటి సాయి కృష్ణ వైస్ ప్రెసిడెంట్
శ్రీ కరిముజ్జి బాలకృష్ణ ఎంపిటిసి -2
శ్రీ పల్లి చిన్ని, 1వ వార్డు సభ్యులు
శ్రీమతి నూతంగి రేఖ వైస్ ఎంపిపి - 2
శ్రీ యలమాటి సత్యనారాయణ 2వ వార్డు సభ్యులు
శ్రీ పలివు మురళీ గణేష్ 3వ వార్డు సభ్యులు
శ్రీమతి చంద్రు కనకదుర్గాదేవి 4వ వార్డు సభ్యులు
కుమారి కొడమంచిలి గీతాశ్రీ 5వ వార్డు సభ్యులు
శ్రీ గెల్లా త్రినాథులు 6వ వార్డు సభ్యులు
శ్రీమతి కొలూరి దుర్గాదేవి 7వ వార్డు సభ్యులు
శ్రీమతి ఉండవల్లి మంగాదేవి 8వ వార్డు సభ్యులు
శ్రీమతి ఈదుపుగంటి శ్రీదేవి 9వ వార్డు సభ్యులు
శ్రీ తాళ్ళూరి సత్యనారాయణ 10వ వార్డు సభ్యులు
శ్రీమతి కిలాలి సత్యవతి 11వ వార్డు సభ్యులు
శ్రీమతి మీసాల రామలక్ష్మి 12వ వార్డు సభ్యులు
శ్రీ గార శ్రీను, 13వ వార్డు సభ్యులు
సత్యవరపు భూపతి పంచాయితీ కార్యదర్శి, పశివేదల కొవ్వూరు మండలం

అక్షరమే ఆయుధంగా సాగుతున్న ఆంధ్రజ్యోతి 23వ వార్షికోత్సం సందర్భంగా యాజమాన్యానికి, సిబ్బందికి వార్షికోత్సవ విజయదశమి శుభాకాంక్షలు...
ABN ఆంధ్రజ్యోతి
పంచాయితీ కార్యదర్శులు, నిడదవోలు మండలం

ఆంధ్రజ్యోతికి 23వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
జనసేన నాయకులకు, కార్యకర్తలకు గ్రామ ప్రజలకు విజయదశమి & దీపావళి శుభాకాంక్షలు
పెనుమత్స చందు
అధ్యక్షులు : శింగవరం సొసైటీ, జనసేన నాయకులు, శింగవరం

ఆంధ్రజ్యోతికి 23వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
కొవ్వూరు నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ ముప్పిడి వెంకటేశ్వరరావు గార్కి ప్రజలకు,కూటమి నాయకులకు, కార్యకర్తలకు, శ్రేయోభిలాషులకు,
దసరా మరియు దీపావళి శుభాకాంక్షలు
నాయుడు వీర్రాజు సొసైటి అధ్యక్షులు, మద్దూరు
ఆకుల నాగరాజు, డైరెక్టర్ పిల్లి సత్యనారాయణ డైరెక్టర్
సి.ఇ.ఓ. ఈదల పట్టాభి రామారావు మరియు ఆఫీసు సిబ్బంది
అంబటి నాగరాజు MPTC జనసేన నాయకులు, మద్దూరు
పిండి కృష్ణ గ్రామ జనసేన ప్రెసిడెంట్, మద్దూరు
డేగల రాంబాబు నాయకులు, మద్దూరు
అంబటి నానాజీ టిడిపి మండల వైస్ ప్రెసిడెంట్ మద్దూరు
అడ్డాల సూరిబాబు జనసేన నాయకులు, మద్దూరు
నాయుడు సాయి టిడిపి నాయకులు, మద్దూరు
నున్న బుల్లి వెంకటరత్నం చక్రవర్తుల ట్రస్టబోర్డ్ చైర్మన్, మద్దూరు
తెలుగుదేశం, జనసేన, బి.జే.పి. నాయకులు, మద్దూరు

ఆంధ్రజ్యోతికి 23వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
ది.కొవ్వూరు కోపరేటివ్ అర్బన్ బ్యాంక్ లి॥ నెం.3423
బాపూజీ నగర్ - కొవ్వూరు
గౌరవ సభ్యులకు / ఖాతాదారులకు విజ్ఞప్తి
106 సం॥రాలుగా కొవ్వూరు పరిసర ప్రాంత ప్రజలకు సేవలందించుచున్న నమ్మకమైన బ్యాంకు. డిపాజిట్లపై అత్యధిక వడ్డీని చెల్లించుచూ సభ్యులకు అవసరాలకు అనుగుణముగా అప్పులు మంజూరు చేయుచూ ప్రజల మన్ననలు పొందుతున్న బ్యాంక్
డిపాజిట్ల పై వడ్డీ రేట్లు
1సం॥ నుండి 10 సం॥ కాలపరిమితి వరకు అన్నిరకాల డిపాజిట్లపై -8% వడ్డీ
1సం॥ నుండి 10 సం॥ కాలపరిమితి వరకు సీనియర్ సిటిజన్‌లకు -8.5% వడ్డీ
సభ్యులకు ఇచ్చు అప్పులు పై వడ్డీ వివరములు :
1. స్వంత ఇంటి నిర్మాణమునకు అప్పుల పై వడ్డీ 11% రిబేటు పోగా 9%
2. ఇల్లు/ అపార్ట్‌మెంట్ కొనుగోలు పై వడ్డీ 11% రిబేటు పోగా 9%
3. వ్యవసాయ ఋణములపై వడ్డీ 11 %
4. వివాహము, విద్య, వాహనము మరియు వ్యాపారములకు కూడా అప్పులు ఇవ్వబడును
5. బంగారు ఆభరణముల హామీ పై వడ్డీ 7.5%
వి.ఎస్. శ్రీనివాస్, కార్యదర్శి
మద్దిపట్ల శివరామకృష్ణ, అధ్యక్షులు
పాలకవర్గ సభ్యులు మరియు బ్యాంక్ సిబ్బంది అభినందనలతో...

అక్షరమే ఆయుధంగా దూసుకుపోతున్న ఆంధ్రజ్యోతి యాజమాన్యానికి, సిబ్బందికి 23వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
మహారాజా మష్రూమ్స్ డిస్ట్రిబ్యూటర్స్ (తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలు) తోగుమ్మి, కొవ్వూరు మండలం
ప్రొ : బిక్కిన ఫణీంద్ర సెల్: 8106212344
పసలపూడి సుభాష్‌చంద్రబోస్ రాష్ట్ర తెలుగురైతు కార్యనిర్వాహక కార్యదర్శి

ఆంధ్రజ్యోతికి 23వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
ది రంగరాయ విశాల వ్యవసాయ సహకార పరపతి సంఘం, పశివేదల - కొవ్వూరు మండలం
సొసైటీ పరిధిలోని గ్రామాల ప్రజలకు,రైతులకు, ఖాతాదారులకు, దసరా & దీపావళి శుభాకాంక్షలు
సంఘము స్థాపించిన తేది : 14.06.1947
సంఘము నందు మెంబర్లు : 1649
సంఘము నందు అప్పుపొందిన మెంబర్లు : 625
సంఘము కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ నుండి పొందిన అప్పులు : 10,57,81,939/-
సంఘము మెంబర్లకు యిచ్చిన అప్పులు : 23,90,50,112/-
మెంబర్లు చెల్లించిన షేరుధనము : 1,22,38,220/-
మెంబర్లు డిపాజిట్లు : 11,23,56,967/-
సంఘము డి.సి.సి.బి నందు వేసిన డిపాజిట్లు : 6,80,00,000/-
కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ నందలి షేరుధనం : 90,24,000/-
ఎరువుల వ్యాపారము 2024-2025 : 3,29,71,090/-
సంఘము నందు రిజర్వులు : 7,50,00,000/-
సంఘము 2024-2025 సం.. నకు నికర లాభము : 1,69,18,219/-
మెంబర్లకు షేరుధనంపై డివిడెండ్ : 15%
గారపాటి రామచంద్రరావు చైర్‌పర్సన్, పశివేదల ఎల్.ఎస్.సి.ఎస్

ఆంధ్రజ్యోతికి 23వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
ది దొమ్మేరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం, దొమ్మేరు - కొవ్వూరు మండలం
సొసైటీ పరిధిలోని గ్రామాల ప్రజలకు,రైతులకు, ఖాతాదారులకు, దసరా & దీపావళి శుభాకాంక్షలు
సంఘము స్థాపించిన తేది : 15.12.1949
సంఘము నందు మెంబర్లు : 983
సంఘము నందు అప్పుపొందిన మెంబర్లు : 466
సంఘము కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ నుండి పొందిన అప్పులు : 13,11,54,448/-
సంఘము మెంబర్లకు యిచ్చిన అప్పులు : 13,72,72,385/-
మెంబర్లు చెల్లించిన షేరుధనము : 1,09,89,563/-
మెంబర్లు డిపాజిట్లు : 1,60,80,486/-
సంఘము డి.సి.సి.బి నందు వేసిన డిపాజిట్లు : 2,04,15,565/-
ఎరువుల వ్యాపారము 2024-2025 : 2,67,57,799/-
సంఘము నందు రిజర్వులు : 1,32,62,166/-
సంఘము 2024-2025 సం.. నకు నికర లాభము : 19,03,127/-
గారపాటి రామకృష్ణ చైర్‌పర్సన్
శ్రీమతి సిద్దగని సావిత్రమ్మ, పర్సన్
తోట ముద్దుల బాబు, పర్సన్
కలబండి ప్రసాద్ సి.ఈ.ఓ, సంఘ సభ్యులు మరియు కార్యాలయ సిబ్బంది
గారపాటి రామకృష్ణ చైర్‌పర్సన్, దొమ్మేరు పి.ఏ.సి.ఎస్

ఆంధ్రజ్యోతికి 23వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
ది ఆరికిరేవుల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం, Regd No.wg472 ఆరికిరేవుల - కొవ్వూరు మండలం
సొసైటీ పరిధిలోని గ్రామాల ప్రజలకు,రైతులకు, ఖాతాదారులకు, దసరా & దీపావళి శుభాకాంక్షలు
సంఘము స్థాపించిన తేది : 19.02.1949
సంఘము నందు మెంబర్లు : 1054
సంఘము నందు అప్పుపొందిన మెంబర్లు : 582
సంఘము కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ నుండి పొందిన అప్పులు : 16,68,52,079/-
సంఘము మెంబర్లకు యిచ్చిన అప్పులు : 18,27,51,037/-
మెంబర్లు చెల్లించిన షేరుధనము : 1,49,44,574/-
మెంబర్లు డిపాజిట్లు : 2,89,35,875/-
కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ నందలి షేరుధనం : 1,10,06,000/-
ఎరువుల వ్యాపారము 2024-2025 : 1,62,50,748/-
సంఘము నందు రిజర్వులు : 58,31,963/-
సంఘము 2024-2025 సం.. నకు నికర లాభము : 12,87,560/-
మెంబర్లకు షేరుధనంపై డివిడెండ్ : 15%
[illegible]
చైర్‌పర్సన్, ఆరికిరేవుల పి.ఏ.సి.ఎస్